సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి
నల్గొండ-యాదాద్రి-సూర్యాపేట
బుధవారం 17, ఏప్రిల్ 2024 పేజీలు - 8

# రఘువీర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



మిర్యాలగూడ మేజర్ న్యూస్ః నల్గొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం సోమవారం నాడు మిర్యాలగూడ ఎన్ఎస్‌పి క్యాంప్ నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మణ్ రెడ్డి, నాగార్జునా సాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు శంకర్ నాయక్, రాష్ట్ర నాయకులు స్కైలాబ్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు పొదిల శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, మండల అధ్యక్షులు బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడి వలే పనిచేసి కుందూరు రఘువీర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## శివ సేన జిల్లా అధ్యక్షులు బీజేపీలో చేరిక

నాగం వర్షిత్ రెడ్డి

వివరాలు 8లో

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన




*నల్గొండ జిల్లా బ్యూరో*

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజ వర్గం ఎన్నికల నిర్వహణకు సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల యంత్రాంగాలు సిద్ధంగా ఉండాలని నల్గొండ జిల్లా కలెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకుగాను ఆయా జిల్లాల నుండి అవసరమైన సిబ్బంది వివరాలను, అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్స్‌ల వివరాలను తక్షణమే సమర్పించాలని కోరారు. జిల్లాస్థాయి అధికారులను, ప్రత్యేకించి పార్లమెట్ ఎన్నికలలో నోడల్ అధికారులుగా వ్యవహరించిన వారినే ఎమ్మెల్సీ ఎన్నికలకు సైతం నోడల్ అధికారులుగా నియమించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల రూట్లు, రూట్ మ్యాప్‌లను తయారు చేయాలని, అవసరమైన పోలింగ్ సామాగ్రి, వాహనాలు వంటి వాటి విషయంలో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని, బడ్జెట్ వివరాలను సైతం ముందే పంపిచాలని కోరారు. ఆయా జిల్లాల నుండి కలెక్టర్లు, నల్గొండ రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

# ఘనంగా సీతారామచంద్రస్వామి ఎదుర్కోలు ఉత్సవం







నల్గొండ అర్బన్ మేజర్ న్యూస్ః శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా క్రోధి నామ సంవత్సర చైత్ర శుద్ధ అష్టమి మంగళవారం రెండవ భద్రాద్రి రామాలయంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఎదుర్కోలు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి సుప్రభాత సేవ నిత్య వీధి అర్చనలు, ప్రబోధిక ఆరోగ్యంపు, అగ్ని ప్రతిష్టాపన హోమము, ధ్వజారోహణ, బలిహరణ, బైరి పూజ దేవత ఆహ్వానము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాలతి దంపతులు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి జయరామయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మాతృశ్రీ పాఠశాల పైశాచికత్వం

## బాలుడిని చితకబాదిన ఉపాధ్యాయుడు

## ఏడుస్తున్న కనికరించని కీచక గురువులు

## పాఠశాలకు వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్న బాల్యం



*నల్గొండ జిల్లా బ్యూరో*

విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దాల్సిన ఉపాధ్యాయులే విచక్షణ కోల్పోయి విద్యార్థులపై విరుచుకుపడితే పరిస్థితి ఏంటి...? సృజనాత్మకతతో పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులు బాల్యంపై కన్నెర్ర చేసి కట్టెతో విచక్షణ రహితంగా దండిస్తే ఇక ఆ పసి బాల్యానికి దిక్కెవరు? బాలుడిని ఉపాధ్యాయులు చితకబాదిన సంఘటన చింతపల్లి మండల కేంద్రంలోని మాతృశ్రీ పాఠశాలలో చోటుచేసుకుంది. తుంగపాడు గ్రామానికి చెందిన బొడ్డుపల్లి త్రిశూల్ మాతృశ్రీ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. మార్కులు తక్కువగా వచ్చాయని చెప్తూ కట్టెతో బొడ్డుపల్లి త్రిశూల్ అనే విద్యార్థిని ఉపాధ్యాయులు విచక్షణ రహితంగా కొట్టడంతో గాయాలు కమిలిపోయాయి. దెబ్బలు తాళలేక త్రిశూల్ ఏడుస్తున్న గానీ ఈ ఉపాధ్యాయులు పట్టించుకోకుండా దండించారు. దొడ్డు కట్టెతో చర్మంపై కొట్టడంతో త్రిశూల్ భయభ్రాంతులకు గురైనాడు. ఆ



బాలుడికి తల్లిదండ్రులు లేకపోవడంతో ఆలనా పాలనా చూసే గార్డియన్ పాఠశాల యాజమాన్యానికి ఫోన్ చేస్తే తమ దృష్టికి ఆలస్యంగా వచ్చిందని సమాధానం చెప్పుండడం విశేషం. ఇటువంటి సంఘటనలపై బాలల హక్కుల పరిరక్షణ కమిటీ తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అర్హతలేని ఉపాధ్యాయులను నియమిస్తూ బాల్యంతో చెలగాటం ఆడే ఇలాంటి పాఠశాలలపై మండల విద్యాధికారి తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# నామినేషన్ల స్వీకరణ సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన

*నల్గొండ జిల్లా బ్యూరో*

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు నియమించిన సిబ్బంది అందరూ జాగ్రత్తగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందనా అన్నారు. మంగళశారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సామవేశ మందిరంలో ఏర్పాటు చేసిన లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాంబ ర్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు నియమించిన అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. నామినేషన్ల కోసం ప్రత్యేకించి హెల్ప్ డెస్ ఏర్పాటు చేయాలని, ప్రతిరోజు ఎన్నికల సంఘానికి పంపిచే నివేదికలు జాగ్రత్తగా పరిశీలించి పంపించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ జిల్లాస్థాయి కంట్రోల్ రూం, ఎన్నికల అనుమతులు ఇచ్చే సువిధ విభాగం, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ విభాగాలను తనిఖీ చేసి ఆయ టీముల పని తీరును పరిశీలించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సెషల్ కలెక్టర్ నటరాజ్, డిఆర్ఓ డి. రాజ్యలక్ష్మి, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



సూర్య



# రైతుపై తూటా

చందంపేట, మేజర్‌న్యూస్ ః రైతాంగ ఆత్మహత్యలు నివారిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీలిచ్చి కేంద్రంలోను, మధ్యప్రదేశ్‌లోను అందలమెక్కిన బీజేపీ ప్రభుత్వాలు అన్నదాతలపైనే తుపాకీ ఎక్కుపెట్టడం హేయమైన చర్య. ఒకవైపు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ మరో వైపు రైతులను పిట్టలను కాల్చినట్టు కాల్చిపడేసిన పాలకుల కిరాతకాన్ని ఎంత ఖండించినా తక్కువే. మధ్యప్రదేశ్‌లో రైతులు తాము పండించిన పంటకు మద్దతు ధర కావాలని అడిగారు. ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాత్రమే వారు కోరారు. రైతులపైకి పోలీసులను ఉసిగొల్పి ఆరుగురిని పొట్టనబెట్టుకోవడం దుర్మార్గం. సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ ప్రభుత్వమైనా నిర్వర్తించాల్సిన కనీస బాధ్యత. దీనిని విస్మరించి నిరంకుశంగా అణచివేయాలని చూడడం అప్రజాస్వామికం. మధ్యప్రదేశ్‌లో మొదట ఒక జిల్లాలో ప్రారంభమైన రైతుల ఆందోళన క్రమంగా రాష్ట్రంలోని మిగతా అన్ని జిల్లాలకు విస్తరించింది. మందసోర్, పిప్లియామండీ ప్రాంతాల్లో ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి రైతుల పోరాటాన్ని అణచివేయాలని చూసింది. ఈ పాపంలో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వానికీ వాటా వుంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేండ్లు గడిచినా రైతాంగాన్ని ఆదుకునేందుకు ఎలాంటి చర్య తీసుకోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. నయా ఉదారవాద విధానాలతో ఇప్పటికే సంక్షుభితంగా మారిన వ్యవసాయరంగం మోడీ ప్రభుత్వ నిర్వాకం వల్ల మరింత తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడింది. మధ్యప్రదేశ్‌లో కాల్పులు దీనికి పరాకాష్ట. కేవలం ఒక్క మధ్యప్రదేశ్‌లోనే కాదు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోను, దాని మిత్రపక్షాలు అధికారంలో వున్న రాష్ట్రాల్లోను రైతు వ్యతిరేక విధానాలు ఉధృతంగా అమలవుతున్నాయి. మొత్తం రైతు ఆత్మహత్యల్లో 60శాతం దాకా ఈ రాష్ట్రాల్లోనే చోటు చేసుకున్నాయని అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. మొదట గుజరాత్ రైతాంగం వీధుల్లోకి వచ్చింది. నేడు మహారాష్ట్రలో రైతాంగ పోరాటాలు ఉధృతంగా సాగుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఈనాడు బీజేపీ ప్రభుత్వ విధానాలపై ఈ దేశ రైతాంగం తిరుగుబాటు చేస్తోంది. మధ్యప్రదేశ్‌లో రైతాంగ పోరాటం, మహారాష్ట్రలో రైతులు వారం రోజుల పాటు నిర్వహించిన సమ్మె, రాష్ట్ర బంద్ అసాధారణమైనది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అనే కాదు, మిగతా రాష్ట్రాల్లోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై రైతాంగంలో ఆగ్రహం రగుల్కొంటోంది. చత్తీస్‌ఘడ్, హర్యానా, జార్ఖండ్‌ల్లో రైతాంగ పోరాటాలు సాగుతున్నాయి. రైతుల పోరాటానికి బాసటగా నిలవాలని సామాజిక కార్యకర్త అన్నా హజారేను రైతు సంఘాలు కోరగా ఆయన అందుకు నిరాకరించారు. ఇది ఆయన సంకుచిత ధోరణికి నిదర్శనం. ఎఐకెఎస్, ఇతర రైతు సంఘాల ఆధ్వర్యాన మహారాష్ట్ర రైతులు పట్టుదలతో పోరాడుతున్నారు. రైతులు తమ నిరసనలో భాగంగా వ్యవసాయోత్పత్తులను పట్టణాలకు సరఫరా చేయడానికి నిరాకరిస్తున్నారు. వాటిని రోడ్లపై పారబోస్తున్నారు. మహారాష్ట్రలోని ఫడ్నవీస్ ప్రభుత్వం రైతులతో చర్చించి సామరస్యంగా దీనిని పరిష్కరించుకోవడానికి బదులు ఈ ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం అవివేకం. తమిళనాడులో 140ఏండ్లలోనే అతి పెద్దకరువు గత సంవత్సరం చోటు చేసుకుంది. ఈ కరువు బారిన పడి ఇప్పటివరకు 400మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విపత్కర పరిస్థితినుంచి తమిళనాడును ఆదుకునేందుకు 40వేల కోట్ల ప్యాకేజీ కావాలని తమిళనాడు రైతులు నలభై రోజులకుపైగా ఆందోళన నిర్వహించారు. రాజధాని ఢిల్లీలో దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. రైతులు ఎంత ఘోషించినా రుణమాఫీ చేసే ప్రసక్తే లేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెగేసి చెప్పారు. కరువుతో అల్లాడుతున్న తమిళనాడుకు ఇంతవరకు పైసా కూడా సాయం చేయలేదు. పైగా సుప్రీం కోర్టులో దీనిపై కేంద్రం తన వాదన వినిపిస్తూ తమిళనాడులో రైతులెవరూ ఆత్మహత్య చేసుకోలేదని చెప్పింది. ఇది తమిళప్రజలతో క్రూర పరిహాసమాడటమే. రైతులను ఉద్ధరించేందుకే తెచ్చానని ఘనంగా చెప్పుకున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతులకు అక్కరకు రాలేదు. కానీ కార్పొరేట్ బహుళజాతి కంపెనీలకు దండిగా కాసులపంట పండించింది. ఫసల్ బీమా యోజన కింద 2016-17లో ప్రయివేట్ బీమా కంపెనీలు ప్రీమియం రూపంలో రైతుల నుంచి 21,500 కోట్లు దండుకున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పరిహారం కింద 4,270 కోట్లు క్లెయిమ్ చేయగా, 714 కోట్లు మాత్రమే ఇచ్చాయి. దీనిని బట్టి ఈ ఫసల్ బీమా యోజన ఎవరికోసం ఉద్దేశించిందో ఇట్టే అర్థమవుతోంది. వ్యవసాయరంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం, మేడ్ ఈజీ బిజినెస్ వంటి విధానాల ద్వారా మోడీ సర్కార్ ఈ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నది. దీనికి వ్యతిరేకంగా గ్రామీణ పేదలు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఆదివాసీలు సమైక్య పోరాటాలను ఉధృతం చేయడం ఒక్కటే మార్గం.

# వివక్ష లేని సమాజం కోసం

సమాజంపై అవగాహన ఎందరికో ఉండొచ్చు... మార్చాలనే తపన కొందరికే ఉంటుంది. అలా తపించే వారిలో ప్రొఫెసర్ లక్ష్మి ఒకరు. సమానత్వం, వివక్ష లేని మరో సమాజం కోసం నిరంతరం పోరాడుతున్నారు. విద్యార్థి దశ నుంచే హ్యూమనిస్టుగా, యాక్టివిస్టుగా స్త్రీ సమానత్వం కోసం గొంతు విప్పారు. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీకి మొదటి మహిళా ప్రిన్సిపల్‌గా చరిత్ర సృష్టించారు. రిటైర్‌మెంట్ తర్వాత కూడా స్త్రీ సమస్యలపై తన పోరాటం ఆపలేదు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్రంలో పెట్రేగుతున్న కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా తన గొంతు విప్పుతున్న ఆమెతో మానవి సంభాషణ...

ఇటీవల మన రాష్ట్రంలో కులదురహంకార హత్యలు బాగా జరుగుతు న్నాయి. వీటికి కారణం ఏమిటి?

ఇవి గతంలో కూడా ఉన్నాయి. అయితే బయటకు వచ్చే వాటి సంఖ్య చాలా తక్కువ. ఇప్పుడు మీడియా పెరిగిపోవడం వల్ల బయటకు ఎక్కువగా వస్తున్నాయి. కులం, మతం, మూఢనమ్మకాలు, సంప్రదాయాలు, ఇలా వీటన్నింటి వల్ల తల్లిదండ్రులు, కులపెద్దలు పిల్లల ఇష్టాలను అంగీకరించడం లేదు. రోజురోజుకు సమాజంలో కుల సమస్య పెరిగిపోతుంది. అందుకే ఈ హత్యలు జరుగుతున్నాయి.

ఈ వివాహాల వల్ల అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు?

మొదట తల్లిదండ్రులు ఆమె ప్రేమను అంగీకరించరు. ఇంట్లో వాళ్ళ ఇష్టాన్ని కాదని పెండ్లి చేసుకుంటే ఇల్లు వదిలి వెళ్ళిపోవాలి. సమాజం కూడా అమ్మాయి నిర్ణయాన్ని స్వాగతించదు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కరికైనా ఉద్యోగం లేకపోతే బతకడం కష్టం. ఆర్థిక ఇబ్బందులు వస్తాయి. ఈ ప్రభావం అమ్మాయిలపైనే ఎక్కువగా ఉంటుంది.

అసలు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే అవకాశం అమ్మాయిలకు ఎంత వరకు ఉందంటారు?

ఈ పితృస్వామ్య సమాజంలో ఆడపిల్లతో పాటే ఆంక్షలు, కట్టుబాట్లు కూడా పుడతాయి. ఎలాంటి బట్టలు వేసుకోవాలి?, ఎలా మాట్లాడాలి?, ఏం తినాలి?, ఎంత తినాలి? వరకు అన్నీ ఆంక్షలే. పెండ్లి సంబంధం వస్తే 'ఈ అబ్బాయి నాకు ఇష్టం లేదు' అని అంటే 'నోరుమూసుకో ఇంకెవరికీ చెప్పకు, నీ చెల్లెళ్ళకు పెండ్లి కాదు' అంటారు. రాజ్యాంగం ప్రకారం వివాహానికి సంబంధించి సమ్మతి హక్కు అమ్మాయికి ఉంది. కానీ దాన్ని ఎవ్వరూ పట్టించుకోరు. అమ్మాయికి జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ కల్పించాలి.

తల్లి ఇంటి పేరు, కులం పెట్టుకోవడంలో ఎన్నో ఆటంకాలు ఉన్నాయి. దీని గురించి మీరేమంటారు?

ఏ బిడ్డకైనా తల్లి ఒక వాస్తవం, తండ్రి ఓ నమ్మకం. తొమ్మిది నెలలు మోసిన తల్లి కులం బిడ్డకు వర్తించదంటారు. ఇది సరైనది కాదు. గతంలో స్కూల్లో తండ్రిపేరే అడిగేవారు. కానీ మహిళా ఉద్యమాల ఫలితంగా తల్లిపేరు కూడా చేర్చు కోగ లిగాం. అలాగే ఓ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పిల్లలు తల్లిదండ్రుల కులాల్లో తమకు ఇష్టమైన ఏ కులాన్నైనా పెట్టుకోవచ్చు.

మొదటి నుంచి మానవీయ విలువలతో పెరిగారు. మీ బాల్యం ఎలా గడిచింది?

మాది మిర్యాలగూడ. అక్కడే పుట్టి, పెరిగాను. అమ్మ విరాటమ్మ, నాన్న రామచంద్రయ్య. ఇద్దరూ వ్యవసాయం చేస్తారు. అమ్మ చాలా కష్టపడేది.

మా ఇంట్లో అన్ని కులాల వారినీ సమానంగా చూసేవారు. మేము ఎనిమిది మంది సంతానం. మా అమ్మ చదువు కోలేదు. నాన్న కొద్దిగా చదువుకు న్నారు. కానీ.. సామాజిక అవగాహనతో మమ్మల్ని చదివించారు. అయితే పదో తరగతి పూర్తి కాగానే ఆడపిల్లకు పెండ్లి చేయాలి అని భావించే పల్లెటూరు మాది. నాకూ అలాగే చేయాలనుకున్నారు. అయితే నేను ఒప్పుకోలేదు. స్కూల్ టాపర్ కావడంతో అన్నయ్యలు సపోర్ట్ ఇచ్చి ఇంటర్‌లో చేర్చారు. తర్వాత ఖమ్మంలో మా అన్నయ్య ఇంట్లో ఉండి అక్కడే డిగ్రీ చేశాను. మళ్ళీ ఇంటికి వెళితే పెండ్లి చేస్తారని అటునుంచి అటే స్నేహితులతో కలిసి హైదరాబాద్ వెళ్ళి పీజీకి ఎన్‌ట్రన్స్ రాశాను. మా ఊరి నుంచి ఎంట్రన్స్ రాసిన వారిలో యూనివర్సిటీలో సీటు వచ్చింది నాకొక్కదానికే. దాంతో ఊళ్ళో అందరూ మెచ్చుకున్నారు. దాంతో అమ్మానాన్నలు గర్వపడ్డారు. నేను ధైర్యం చేసి ఇంటికి వెళ్ళి డబ్బులు తెచ్చుకుని పీజీ పొలిటికల్ సైన్స్‌లో చేరాను. అలా మా కుటుంబంలో ఉన్నత విద్యను చదవిన మొదటి ఆడపిల్లను నేనే.

టీచింగ్‌వైపుకు ఎందుకు వచ్చారు?

పీజీ పూర్తి చేసిన తర్వాత బ్యాంక్ ఉద్యోగం కూడా వచ్చింది. కానీ ఆ టేబుల్ వర్క్ చేయడానికి మనసు అంగీకరించలేదు. ఎమ్‌ఫిల్‌లో చేరాను. తర్వాత 'మహిళా నాయకత్వం' అనే అంశంపై పీహెచ్‌డీ చేశాను. ఎప్పటికైనా అవినీతి ఉండని జాబ్ చేయా లనుకున్నాను. అప్పట్లో అలాంటి జాబ్ టీచింగ్. దాంతో ఇక టీచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాను. ఈ వృత్తిలోకి వచ్చిన తర్వాత యంగ్ టీచర్, బెస్ట్ టీచర్ అవార్డు తీసుకున్నాను. 2002లో ప్రొఫెసర్‌గా, తర్వాత ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించాను.

మరి యాక్టివిస్టుగా ఎలా మారారు?

విద్యార్థినిగా లేడిస్ హాస్టల్ వార్డెన్‌గా బాధ్యతలు చూసేదాన్ని. అక్కడే అనేక విద్యార్థి సంఘాలతో పరిచయాలు ఏర్పడ్డాయి. మా హాస్టల్లో పని చేసే వర్కర్లు ఉండే బస్తీలకు వెళ్ళి వాళ్ళకు అక్షరాలు నేర్పించేవాళ్ళం. యూనివర్సిటీలో ఏ అన్యాయం జరిగినా వ్యతిరేకించేవాళ్ళం. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం చేసేవాళ్ళం. జెండర్ సమస్యపై, సేవ్ గర్ల్ చైల్డ్ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేశాం. ఉమెన్స్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా మరెన్నో కార్యక్రమాలు చేశాం. ముఖ్యంగా అమ్మాయిలకు లీగల్, సోషల్ కౌన్సెలింగ్ ఇచ్చేవాళ్ళం.

మీదీ కులాంతర వివాహమే కదా, ఏమైనా సమస్యలు ఎదుర్కొన్నారా?

సమస్యలేమీ లేవు. మా వారి పేరు శివాజీ. ఆయన నాతో పాటు పీహెచ్‌డీలో చేశారు. దండలు కూడా మార్చుకోకుండా రిజిష్టర్ ఆఫీస్‌కు వెళ్ళి సంతకాలు పెట్టి వచ్చేశాం. పెద్దలు మాత్రం రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఆయనా లెక్చరర్‌గా చేసేవారు. అది మానేసి ప్రస్తుతం 'సర్వ్' అనే సోషల్ ఆర్గనైజేషన్‌లో పని చేస్తున్నారు. గ్రామాల్లో దళితులు, చెంచుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. మాకు ట్రిపులెట్ బేబీస్. ముగ్గురు బాబులు. ప్రస్తుతం ఇంటర్ పూర్తి చేసి పై చదువులకు సిద్ధంగా ఉన్నారు.

ఇన్ని బాధ్యతలు నిర్వర్తించారు. మీరెప్పుడైనా జెండర్ సమస్యను ఎదుర్కొన్నారా?

నేను స్ట్రాంగ్. అందుకే నా జోలికి ఎవ్వరూ రారు. అయితే యూనివర్సిటీలో జెండర్ సమస్యలు చాలా ఉన్నాయి. వీటిపై కచ్చితంగా పని చేసేవాళ్ళం. ఇప్పటికీ చేస్తున్నాం.

సరైన గైడెన్స్ ఇస్తే...

మహిళలు ఓ వ్యక్తిత్వంతో పెరగాలి. చదువుకోవాలి. స్వతంత్రంగా బతికే హక్కు ఉంది అని నమ్మాలి. నీ శరీరంపై నీకు హక్కు ఉండాలి. తనలో ఉన్న శక్తిని గుర్తించాలి. నేను ఆడపిల్లను అనే భావనను పక్కన పెట్టాలి. శారీరకంగా, మానసికంగా స్ట్రాంగ్‌గా ఉండాలి. నా కెరీర్‌లో ఎంతో మంది విద్యార్థులను చూశాను. యువతకు సరైన గైడెన్స్ ఇస్తే మంచి దారిలో వెళతారు. నా దృష్టిలో టీచర్ అంటే పుస్తకాల్లో ఉండేది నాలుగ్గోడల మధ్య చెప్పడం కాదు, సమాజం గురించి, జీవితం గురించి నేర్పాలి. ఉపాధ్యాయులు ఇలా చేయగలిగితే ప్రతి అమ్మాయి, అబ్బాయి ఆణిముత్యాల్లా తయారవుతారు.

ప్రత్యేక చట్టం కావాలి

దేశంలో సమసమాజం రావాలన్నా, కులర హిత సమాజం ఏర్పడాలన్నా, స్త్రీ-పురుషుల మధ్య అంతరాలు తొలగించాలన్నా కులాంతర వివాహాలు చేసుకునే వారికి కొన్ని అవకాశాలు కల్పించాలి. వీరికి రక్షణ కల్పించే ప్రత్యేక చట్టం కావాలి. ముందు ఆ జంటకు ఆర్థికంగా సహకరించాలి. ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. అమ్మాయిలకు ధైర్యం చెప్పాలి. వారి పిల్లలకు అన్నింట్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి. అలాగే భద్రత అనేది కీలకం. కాబట్టి వీరి వివాహాలను రికార్డ్ చేయాలి. అన్నింటి కంటే ముఖ్యంమైనది ఇలాంటి వివాహాల పట్ల సమాజానికి అవగాహన కల్పించాలి.

విధాన నిర్ణయాల్లో
భాగస్వామ్యం

విధాన నిర్ణయాల్లో మహిళలకు భాగస్వామ్యం లేదు. మహిళల సమస్యలంటే సంస్కరణ దృష్టితోనే చూస్తున్నారు. మహిళలకు విధాన నిర్ణయాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా స్త్రీ సమానత్వం సాధ్యం కాదు. మన రాష్ట్రంలో మంత్రి మండలిలో ఒక్క మహిళకు అవకాశం ఇవ్వలేదు. వీసీలుగా ఒక్క మహిళను తీసుకోలేదు. ఏండ్లు గడుస్తున్నా మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగానే చూస్తున్నారు. సమాజంలో సగభాగమైన మనకు అధికారంలో కూడా మన వాటా మనకు రావాలి.

# లక్ష్యం

నాంపల్లి, మేజర్‌న్యూస్ ః పడుకున్నవాడు లేచి తిరిగి మళ్లీ పడుకోవడమే జీవితమని కొందరంటున్నారు. 'కలకానిది విలువైనది జీవితం' అన్నాడు.. శ్రీశ్రీ. జీవితం ప్రవాహం, జీవితం నది, జీవితం స్రవంతి. ప్రవాహం నిరంతరం కదులుతుంటుంది. కదలికలేని ప్రవాహం లేదు. నది నిరంతరం చలనంతో ఉంటుంది. అయినా చలించినట్టు కనబడదు. నిరంతరం కదులుతూ కదిలినట్టు కనిపించనిదే జీవితం అంటాడు దాశరథి రంగాచార్య. నది ప్రవాహం జీవనవేగాన్ని సంకేతిస్తున్నది. నీటి పరుగు చైతన్యాన్ని సూచిస్తున్నది. జీవిత ప్రవాహం ప్రచండ వేగంతో వెళ్లిపోతూ ఉంది. అందులో ఎవరెవరి సంస్కారాన్ని బట్టి వాళ్లు తమ సుఖం కోసం కొట్లాడుకుంటున్నారు అంటాడు అసమర్థుని జీవయాత్రలో గోపీచంద్. అసలు మనం సక్రమంగా జీవించలేకపోతున్నాం... జీవితంలో అనేకనేక అవకాశాలు మన ముందు కొస్తుంటాయి. అన్నీ ముఖ్యమనిపించినా ఎదురైన ప్రతి అవకాశం అందివుచ్చుకోలేము. అందుకే జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికున్న అవకాశాలను పరిశీలించుకుని ముందుకు పోవాల్సి ఉంటుంది. నీటి ప్రవాహాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. ప్రవాహానికి అడ్డువస్తే నీళ్లు అక్కడే ఆగిపోవు. కొత్తదారి వెతుక్కొని కొండల్లో జలపాతాలుగా రాళ్ల మధ్య పాయలుగా, ఇసుకమేటల్లో ఏర్లుగా ప్రయాణాన్ని సాగిస్తాయి. విద్యార్థి అయితే తాను ఏ వృత్తిలో స్థిరపడదలచుకున్నాడో లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. అందుకనుగుణమైన కోర్సునే ఎంచుకోవాలి. ఊహల్లో విహరించకుండా వ్యూహంతో చదివితే లక్ష్యం సిద్ధిస్తుంది. ఎక్కడో మారుమూల ప్రాంతంలో పేదరికంతో పోరాడుతూ... గోపాలకృష్ణ ఐఏఎస్ లక్ష్యంగా నిర్దేశించుకుని విజయం సాధించిన అనుభవం మన కండ్లముందే కనబడుతున్నది. "ఒక నదిని దాటడం నీ లక్ష్యమైతే.. అందుకు నావగాని, వంతెన గాని లేకుండా నదిని దాటడం సాధ్యం కాదు" అన్నాడు మావో. అంటే లక్ష్యం మంచిదైనా దాన్ని చేరుకోవడానికి నిర్ణయించుకునే సాధనాలపైన జయపజయాలు ఆధారపడి ఉంటాయి. ఏ లక్ష్య సాధనకైనా క్రమశిక్షణ అవసరం. వ్యక్తిగత లక్ష్యాలతో లాభనష్టాలూ కష్టసుఖాలు ఆయా వ్యక్తుల వరకే పరిమితం అవుతాయి. అదే మన సమాజానికి బాధ్యత వహించినప్పుడు సమిష్టి లక్ష్యంగా మారుతుంది. తప్పుడు లక్ష్యాల వల్ల మనమే కదా నష్టపోయేది అనుకుంటే కుదరదు. దాని ప్రభావం మొత్తం సమాజంపైనా ఉంటుంది. లక్ష్యాలు ఉన్నతమైనవైతే సాధనలాంటివైనా పరవాలేదా? శంకరాచార్యుడు జీవాత్మ - బ్రహ్మాత్మల ఏకత్వాన్ని తెలుసుకోవడమే లక్ష్యం అన్నాడు. ఇందుకు జ్ఞాన సంపాదన మార్గమన్నాడు. వీరు వాస్తవ జీవితంతో సంబంధం లేని లక్ష్యాన్ని ఎంచుకున్నారు.

కమ్యూనిస్టుల దృష్టిలో జీవిత లక్ష్యం మానవజాతి సుఖసంపదలతో జీవించడం. భౌతికంగానూ, సాంస్కృతికంగానూ అంతకంతకు ఉన్నత శిఖరాలకు అందుకోవడం. ప్రతి మానవుడు తోటి వారితో కలిసి మానసిక శక్తులను అభివృద్ధి చేసుకోవడానికి అంతకంటే ఎక్కువ స్వేచ్ఛ సంపాదించడం. పరాయి పాలనకు స్వస్తిపలికి స్వాతంత్ర్యం సాధించుకునేందుకు భారత ప్రజలు శత సంవత్సరాలు పోరుసల్పారు. ఈ వందేండ్ల స్వాతంత్ర్య పోరాటం మన లక్ష్యంగా ఉన్నది. లక్ష్యం మహోన్నతమైనదని అందరూ అంగీకరించారు. ఏకాభిప్రాయానికి వచ్చారు. కానీ సాధన మార్గం విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవచ్చు. అహింసను జీవిత లక్ష్యంగా పెట్టుకున్న గాంధీ మహాత్ముడే పిరికితనంతో బానిస జీవితం గడపడం కన్న దౌర్జన్యంతో శత్రువును ప్రతిఘటించడం మంచిదన్నాడు. ఉరితీయబడ్డ భగత్‌సింగ్ దేశభక్తిని పొగుడుతూనే అతడు ఎంచుకున్న మార్గం సరైనది కాదంటూ గాంధీజీ పెట్టిన తీర్మానం కాంగ్రెస్‌లో వీగిపోయింది. ఆ కాలంలో దేశం కోసం పోరాడి అమరులైన వారందరు వీరులుగా కీర్తింపబడ్డారు. స్వాతంత్ర్యం సిద్ధించింది. అప్పుడు ఏంచేయాలి అనే ప్రశ్న ముందుకు వచ్చింది. ఒక సమస్యను పరిష్కరిస్తే ఆ సమస్య పరిష్కారంలో మరొక సమస్య పుట్టుకొస్తుంది. ఒక గమ్యాన్ని చేరుకొని అక్కడే ఆగిపోవడం కాదు. ఎప్పటికప్పుడు సమస్త అవకాశాలను వినియోగించుకుంటూ నూతన లక్ష్యాలను చేరుకోవటం. విజయాల మీద విజయాలు సాధిస్తూ కొనసాగించే అనంతయాత్ర, అట్టి యాత్రలో ప్రతిలక్ష్యం ఒక మజిలీ, మరొక లక్ష్యాన్ని సాధించడానికి అదొక ప్రారంభం. నూతన లక్ష్యాలను నిర్దేశించుకునేటప్పుడు మన మార్గం, గమ్యాన్ని బట్టీ పరిస్థితులను బట్టీ కూడా ఉంటుంది. గమ్యాన్ని మరచిపోతే కోరిన లక్ష్యం కాక విరుద్ధమైన ఫలితాలు వస్తాయి. భారత రాజ్యాంగంలో సోషలిజం లక్ష్యంగా ప్రకటించారు. దాన్ని సాధించాలంటే పెట్టుబడిదారీ పద్ధతులు ఎన్నటికీ పనికిరావు. నెరవేరని లక్ష్యాలు పెట్టుకుంటే ఎవరైనా కొంత కాలానికి గందరగోళంలో పడిపోతారు. భవిష్యత్తు చీకటిగా మారుతుంది. మనిషి సంఘ జీవితాన్ని నియంత్రించటానికి రాజ్యం ఏర్పడింది. అది ఏది చెయ్యాలి, ఏది చేయకూడదో చెబుతుంది. అది ఎక్కువ మందిని బాధపెట్టే స్థితికి వస్తుంది.

# జీఎస్టీ

నార్కట్‌పల్లి, మేజర్‌న్యూస్ : జీఎస్టీ అమలుతో పేదలకు లాభం జరుగుతుందని చెప్పిన మోడీ అమెరికాలో 20 టాప్ కంపెనీల సీఈఓల సమావేశంలో వస్తుసేవల పన్ను సంస్కరణలు చేశామనీ, భారత పన్నుల విధానం అమెరికా బిజినెస్ పాఠశాలల్లో పాఠ్యాంశంగా చేర్చవచ్చునని ప్రచారం చేస్తున్నారు. మనదేశ భక్తులు బడుగుల నెత్తిమీద చెయ్యిపెట్టి బడా కార్పొరేట్ సంస్థలకు స్వాగతం పలుకుతున్నారు. మోడీ ద్వంద్వ నీతి బట్టబయలైంది.

కేంద్ర ప్రభుత్వం వస్తుసేవల పన్ను ప్రారంభాన్ని ఒక పెద్ద ఘనకార్యంగా భావిస్తోంది. కేంద్ర పన్నుల విధానానికి వ్యతిరేకంగా వస్త్ర వ్యాపారులు బంద్ పాటించారు. వివిధ రకాల నిరసనలు తెలుపుతున్నారు. వస్త్ర పరిశ్రమలో వెయ్యి రూపాయలు విలువగల వస్త్రాలు కొంటే ఒక పన్ను విధానం, దాటితే మరొక పన్ను విధించటం వల్ల పన్నులు భారంగా పరిణమించనున్నాయి. ముఖ్యంగా చేనేత వస్త్రాల ఉత్పత్తి ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి జీఎస్టీ భారంతో చేనేతరంగం మరింత రక్షణ లేకుండాపోయే ప్రమాదం ఉంది. బీడీ పరిశ్రమ దివాళా తీసి లక్షలాదిమంది బీడీ కార్మికులు ఉపాధిలేక రోడ్డున పడతారు. పాత పన్నుల విధానంలో 18శాతం పన్ను చెల్లిస్తున్నారు. ఇప్పుడు 28శాతానికి పెరగడం వలన అమ్మకాలు పడిపోతాయి. పరిశ్రమలు మూతపడతాయి. కాబట్టి బీడీ పరిశ్రమను జీఎస్టీ నుండి మినహాయించాలనే కోరిక సమంజసమైనదే. ఒకప్పుడు పాలకులు చిన్న పరిశ్రమలను పెద్ద పరిశ్రమల పోటీ నుండి కాపాడేందుకు ప్రత్యేకమైన పన్ను రాయితీలు ఇచ్చేవారు. ఇప్పుడు టర్నోవర్‌ను నామమాత్రంగా పెంచి పన్ను భారాల నుండి మినహాయింపు లేకుండా చేశారు. పన్నుల భారం, కార్పొరేట్ సంస్థల పోటీ తట్టుకోలేక పరిశ్రమలు మూతపడతాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మరొకవైపు జీఎస్టీ అమలు వలన లక్షల ఉద్యోగాలు వస్తాయని ఊదరగొడుతున్నారు. పాలకులు నిరుద్యోగులను భ్రమలకు గురిచేస్తున్నారు.

దేశంలో ఇప్పటికి 60శాతం మందికి పైగా వ్యవసాయం మీద ఆధారపడి పనిచేస్తున్నారు. ఈ రంగం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. పంటలకు గిట్టుబాటు ధరలు రాక అన్నదాతలు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జీఎస్టీ వ్యవసాయ రంగాన్ని కూడా విడిచిపెట్టలేదు. గతంలో అన్ని రకాల ఎరువుల మీద వ్యాట్ 5శాతం మాత్రమే ఉండేది. వస్తుసేవల పన్నులు అమలు అయితే అదనంగా 7శాతం పన్ను పెరుగుతుంది. అదే స్థాయిలో ఎరువుల ధరలు కూడా పెరుగుతాయి. క్రిమి సంహారక మందుల మీద 18శాతానికి పన్నులు పెరుగుతాయి. గోరుచుట్టుపై రోకటిపోటులాగా ఇప్పుడు జీఎస్టీ పన్నుల వలన రైతు నెత్తిన అప్పులు పెరుగుతాయి. ప్రజలెవ్వరూ కోరకుండా పన్నుల విధానాలలో పాలకులు మార్పులు ఎందుకు చేస్తున్నారు? అసలు దేశమంతా ఒకే పన్ను పద్ధతి పాటించాలని ఎవరు బలవంత పెట్టారు? కేంద్ర పాలకులు కార్పొరేట్ శక్తుల పంచన చేరారు. ముందు రిలైట్ రంగంలో సంస్కరణలు చేశారు. వాల్‌మార్ట్ లాంటి సంస్థలకు స్వదేశీ గుత్త సంస్థలకు తలుపులు తెరిచారు.

కార్పొరేట్ పంజరంలో చిక్కిన అధికార పార్టీ చిలుకలు ఒకే దేశం ఒకే పన్ను ఉండాలనే చిలుక పలుకులు పలికారు. ప్రజలకు లాభం జరుగుతుందని ప్రచారం చేశారు. ఏకాభిప్రాయ సాధన పేరుతో అనేక ప్రయత్నాలు చేసి, పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ ద్వారా ఒకే పన్ను ఆమోదింపజేసుకున్నారు. ఫెడరల్ వ్యవస్థపై వేటు వేశారు. గతంలో పన్నుల వ్యవస్థ కేంద్రం చేతిలో ఉండాలా రాష్ట్రం చేతిలో ఉండాలా అని రాజ్యాంగ నిర్మాతలు చర్చించి ప్రత్యక్ష పన్నులు కేంద్రం, పరోక్ష పన్నులు రాష్ట్రాలకు హక్కు భుక్తం చేశారు. ఒకే పన్ను విధానం రావడంలో కేంద్రం ముందు రాష్ట్రాలు సాగిలపడే పరిస్థితి వచ్చింది. వస్తుసేవల పన్నును నిర్ణయించడానికి జీఎస్టీ కౌన్సిల్ ఏర్పడింది. గతంలో పరోక్ష ప్రత్యక్ష పన్నుల వసూలు ఉండేది. ఇప్పుడు మొత్తం పన్నులను మూడు కేటగిరీలుగా విభజించి పన్నులు వేయాలని నిర్ణయించారు. జీఎస్టీ సమావేశానికి హాజరైన రాష్ట్ర మంత్రి తారక రామారావు కొత్తచట్టం వలన రూ. 11వేల కోట్ల భారం తెలంగాణపై పడుతుందని తెలిపారు. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఇన్ని భారాలు పడితే దేశ ప్రజలపై ఎంత భారం పడుతుందో తలుచుకుంటేనే కడుపు తరుక్కుపోతోంది. ముందూ వెనకా ఆలోచించకుండానే టీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రం అడిగిందే తడవుగా జీఎస్టీని ఆమోదించిన ఫలితంగా ప్రజలపై పెద్ద ఎత్తున భారాలు పడుతున్నాయి. వస్తుసేవల పన్ను విధానంలో మార్పులు జరగాలంటే కేంద్రానికి ఇష్టం లేకుండా ఏదీ జరగదు. కౌన్సిల్‌లో 75శాతం మంది ఆమోదిస్తేనే అమలు జరుగుతుంది. కానీ మొత్తం రాష్ట్రాల ఓటు విలువ 66.6శాతం మాత్రమే. అందుకే టీఆర్ఎస్ ప్రభుత్వం చేతిలో ఉన్న హక్కును పోగొట్టుకొని, బీడీ పరిశ్రమకు మిషన్ భగీరథకు పన్ను మినహాయించాలని కోరడం అత్యంత విచారకరం. జీఎస్టీ అమలు కాకముందే రాష్ట్రాల మీద కేంద్రం పెత్తనం పెరిగింది. భవిష్యత్‌లో ఇంకా పెరుగుతుంది. తెలంగాణలో పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేశామని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వాస్తవాలు ఏమిటో బయటపెట్టారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏంలాభం? జీఎస్టీ అమలుతో పేదలకు లాభం జరుగుతుందని చెప్పిన మోడీ అమెరికాలో 20 టాప్ కంపెనీల సీఈఓల సమావేశంలో వస్తుసేవల పన్ను సంస్కరణలు చేశామనీ, భారత పన్నుల విధానం అమెరికా బిజినెస్ పాఠశాలల్లో పాఠ్యాంశంగా చేర్చవచ్చునని ప్రచారం చేస్తున్నారు. మనదేశ భక్తులు బడుగుల నెత్తిమీద చెయ్యిపెట్టి బడా కార్పొరేట్ సంస్థలకు స్వాగతం పలుకుతున్నారు. మోడీ ద్వంద్వ నీతి బట్టబయలైంది.

# బతకాలంటే యుద్ధం చేయాలా ?

త్రిపురారం, మేజర్‌న్యూస్ : ఏలికలకు రైతులు అక్కరలేదేమో...! కానీ ఈ దేశానికి రైతులు కావాలి... భూమిని బువ్వగా మార్చి ప్రజల ఆకలి తీర్చడానికి ఈ దేశానికి రైతులు కావాలి. అందుకు వారికి భూమి కావాలి... సాగుకు సాయం కావాలి. నెత్తురు చెమటగా చేసి, సత్తువ ధారపోసి మన్నును అన్నంగావించే వ్యవసాయం వారికి ఫలసాయం కావాలి.... మన ఏలికలకు రైతులు అక్కరలేదు కానీ, రైతుకు ఆధారమైన భూమి కావాలి. భూమి మీద గాలి, నీరు, మట్టితో పాటు భూమి తన గర్భంలో దాచుకున్న అనంతమైన సంపద కావాలి. ఎవరి కోసం..? ప్రజల కోసమే అనుకుంటే పొరబాటు..! కంపెనీల కోసం... కంపెనీల యజమానుల కోసం..!! ఎందుకంటే వారి సేవకే ఈ ప్రభుత్వాలు. ఇవి పైకి ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలుగానే కనిపిస్తాయి. కానీ ఇవి కార్పొరేట్లు కోరుకున్న ప్రభుత్వాలు. వీరు తలచుకుంటే అమెరికాలో నిలువెల్లా టెంపరితనం నిండిన ట్రంప్‌నైనా అధ్యక్షుడిని చేయగలరు, ఇండియాలో గుజరాత్‌ను రక్తసిక్తం చేసిన మోడీనైనా ప్రధానిని చేయగలరు. కానీ అక్కడ ట్రంపైనా, ఇక్కడ మోడీ అయినా సేవలు చేయవలసింది ఈ కార్పొరేట్ కంపెనీలకే... వారి కృషి మొత్తం ప్రకృతి సంపదను, మానవ శ్రమను కొల్లగొట్టి వీరికి కట్టబెట్టడానికే. ఇప్పుడు ప్రపంచమంతటా జరుగుతున్న ఈ తతంగమే దేశంలోనూ జరుగుతున్నది. మన రాష్ట్రంలోనే కాదు దేశమంతటా రైతుల్లో చెలరేగుతున్న అసంతృప్తి జ్వాలలన్నీ దీనికి సూచికలే..!

దిక్కుతోచక రైతులు పంటలను తగుల బెట్టుకోవడం, మార్కెట్ యార్డుల వద్ద ధర్నాలు చేయడం మాత్రమే చూసిన దేశానికి తొలిసారిగా 'సమ్మె' సెగను చూపించారు మహారాష్ట్ర రైతులు. లక్షలాది లీటర్ల పాలను బజారులో పారించి, టన్నుల కొద్దీ కూరగాయలను వీధుల్లో కుమ్మరించి, వేలాది గేదెలతో రహదారులను దిగ్బంధనం చేసి ప్రభుత్వానికి దిమ్మతిరిగేలా చేశారు మధ్యప్రదేశ్ రైతులు. వీళ్లేం చేస్తారులే అన్న అధికారుల అలసత్వానికి, ప్రభుత్వ అహంకారానికి తిరుగుబాటు రుచి చూపించారు తెలంగాణ రైతులు. వీరందరికంటే ముందు మోడీ స్వరాష్ట్రంలోనే ఈ పోరాటాలకు శ్రీకారం చుట్టారు గుజరాత్ రైతులు. దేశం నడిబొడ్డున మన ప్రభుత్వాల చేతకాని తనాన్ని ఎలుగెత్తి చాటారు తమిళ రైతులు. కానీ మన ప్రభుత్వాలేం చేస్తున్నాయి. ఆవేదన ఆపుకోలేక సమ్మెకు దిగిన రైతును నిర్ధాక్షిణ్యంగా నిర్బంధించింది మహారాష్ట్ర ప్రభుత్వం. గుండె మంటను తట్టుకోలేక రోడ్డెక్కిన రైతుకు "తూపాకీ గుండ్ల"తో సమాధానం చెప్పింది మధ్యప్రదేశ్ ప్రభుత్వం. కడుపు మండి కండ్లు తెరిపించే ప్రయత్నం చేసిన రైతుకు సంకెళ్ళు వేసింది తెలంగాణ ప్రభుత్వం. ఇంతకీ వీరు చేసిన నేరమేమిటి..? ప్రభుత్వాలే ప్రకటించిన ఉచిత విద్యుత్, సాగునీరు కావాలన్నారు. రుణమాఫీని గుర్తుచేసారు. పాల ధరను పెంచమన్నారు. చేసిన కష్టానికి, పెట్టిన పెట్టుబడికి తగిన ధర అడిగారు. ప్రజాస్వామ్యంలో వారికి ఆ మాత్రం హక్కులేదా..? కాళ్ళకింద నేల కరిగిపోతుంటే, రెక్కల కష్టం నక్కల పాలవుతుంటే రైతులేం చేయాలి పోరాడటం తప్ప...!

నేటికీ మనది వ్యవసాయ దేశం. 70శాతం మంది ప్రజలు వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్నారు. ఆ ప్రజలనే పట్టించుకోని ఈ ప్రభుత్వాలనేమనాలి. గతంలో రైతులకు చేతల్లో ఏమీ చేయకపోయినా కనీసం మాటల్లోనైనా రైతే దేశానికి వెన్నెముక అనీ, జై జవాన్.. జైకిసాన్.. అని నినదించేవారు ఏలికలు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వంలో ఆ మాత్రం ప్రస్తావన కూడా కనిపించకపోవడం ఈ ప్రభుత్వ వైఖరిని చెప్పకనే చెవుతోంది. అధికారంలోకి రాకముందు మేనిఫెస్టోల్లో తప్ప అధికారంలోకొచ్చాక రైతుల ఊసే మరిచిపోయారు. రైతులకు రుణమాఫీ అన్నారు. దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ అప్పునపడ్డ రైతులెందరూ, రుణ విముక్తి కలిగించింది ఎందరికీ..? ప్రపంచంలోనే అత్యధిక ఉత్పత్తి చేసే మన మిర్చి రైతుల హాహాకారాలను ఎవరు పట్టించుకున్నారు...? వ్యవసాయ రంగంలోకి ప్రవేశిస్తున్న కార్పొరేట్ కంపెనీలకు, భూస్వాములకు, వాణిజ్య బ్యాంకుల ద్వారా వేల కోట్ల పంట రుణాలనిచ్చిన ఈ ప్రభుత్వాలు పేద రైతులను మాత్రం ప్రయివేటు రుణాల బారిన పడేసి ఆత్మహత్యల పాలు చేశాయి. దేశంలో 70శాతం ప్రజల జీవన్మరణ సమస్యను దాచిపెట్టి అభివృద్ధి గురించి మాట్లాడటం కాన్సర్ వుండుకు ప్లాస్టర్ వేయడమే.... అది గాయాన్ని కనిపించనీయదు కానీ మాన్పించలేదు కదా..!

అది తెలంగాణ కావొచ్చు, ఆంధ్రా కావొచ్చు, కేంద్రం కావొచ్చు... ఇలాంటి ప్రభుత్వాలన్నీ రైతును ఆత్మహత్య తప్ప గత్యంతరం లేని స్థితికి నెట్టి, వ్యవసాయాన్ని నిరుత్సాహపరచి భూమికి దూరం చేయడమే లక్ష్యంగా సాగుతున్నాయి. వివిధ శక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం రకరకాల పద్ధతుల్లో భూఆక్రమణే ఏకైక అజెండాగా కదులుతున్నాయి. ఈ తెర వెనుక కుట్రల ఫలితమే నేటి రైతాంగ సంక్షోభం. కానీ అంతిమంగా ప్రజలే నిర్ణేతలన్న విషయాన్ని నేతలు గుర్తుంచుకోవాలి. "భూమి గుండ్రంగా ఉంది. తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరగడం వలన పగలు, రాత్రి ఏర్పడుతున్నాయి" అని చెప్పినందుకు శాస్త్రవేత్తలకు మరణదండన విధించిన చరిత్ర మన పాలకవర్గాలది. ఎందుకంటే భూమి తమ చుట్టూ తిరగాలనీ, తమ గుప్పిట్లో ఒదగాలని వారి కోరిక.. కానీ అది సాధ్యమా..?

# ఇదేనా సుపరిపాలన ?

ఏలినవారి లీలలు రోజురోజుకీ వింత గొల్పుతున్నాయి. సుపరిపాలనకు తమను తామే ఓ నమూనాగా ప్రచారం చేసుకునేవాళ్ళు, అవినీతి అక్రమాలకు ఆమడదూరమని ప్రకటించుకునేవాళ్ళు, క్రమశిక్షణకు నిబద్ధతకు మారుపేర్లమని నీతులు బోధించేవాళ్ళు ఏపాటి పనిమంతులో ఆచరణలో పదేపదే రుజువవుతున్నది. వీరి విధానాల ఫలితంగా దగాపడిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించండి మొర్రో అంటూ వీధుల్లోకొచ్చి పోరాడుతుంటే విధులు మరిచిన నేతలు వింత వింత విన్యాసాలు చేస్తూ ప్రజలను, ప్రజా ఉద్యమాలను అపహాస్యం చేస్తున్నారు. దేశవ్యాపితంగా రైతాంగం ఆకలి చావులతో, ఆత్మహత్యలతో అల్లాడుతుంటే నేతలు యోగాసనాలు వేసుకోండి అంటూ సూక్తులు వల్లిస్తున్నారు. ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాలు రైతుల ఆగ్రహజ్వాలలతో మండుతుంటే అర్థంలేని దీక్షలు చేస్తూ నీరో చక్రవర్తులను తలపిస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి వినోదాల్లో తేలియాడుతున్నారు.

బీజేపీ పాలనలో దళితులు, ముస్లింలే కాదు, ఇప్పుడు రైతులు కూడా దేశ రాజకీయ చదరంగంలో పావులుగా మారుతున్నారు. అటు బీజేపీ గానీ, ఇటు టీఆర్ఎస్ గానీ స్వాభిమానంతో బతికే రైతును ప్రభుత్వాల సహాయం మీద ఆధారపడే స్థితికి దిగజార్చి వ్యవసాయాన్ని సంక్షోభంలో కొనసాగిస్తున్నాయి. ఓట్లు అవసరమైనప్పుడు రుణమాఫీ లంటున్నాయి. అవసరం తీరాక ఆ ఊసే మరిచిపోతున్నాయి. అంతెందుకు మన రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా అధికారం కోసం ఇద్దరు చంద్రులు రుణమాఫీలు ప్రకటించారు. కానీ అధికారం చేపట్టి మూడేండ్లు ముగుస్తున్నా ఆ రుణమాఫీ ఇంకా సాగుతూ...నే ఉంది..! అప్పట్లో దీనిని వ్యతిరేకించిన ప్రధాని నరేంద్రమోడీ ఉత్తరప్రదేశ్‌లో అధికారం కోసం ఇదే రుణమాఫీని ప్రజలకు వాగ్దానం చేశారు..!! ఇప్పుడేమో "రుణమాఫీ ఒక ఫ్యాషన్ అయిపోయింది' అంటూ వెంకయ్యనాయుడు హేళన చేస్తున్నారు. ఇదంతా ఏరుదాటి తెప్ప తగలేసిన చందంగా ఉంది. ఫలితంగా ఈ దేశంలో ప్రభుత్వాల విధానాల వలన దగాపడుతున్న ప్రజానీకంలో రైతులు ముందు వరుసలోకి వస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అయితే ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది.

నేడు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో ఏం జరుగుతున్నది..? బీజేపీకి ఘనవిజయాలను అందించిన ప్రజలే వారి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆందోళనలకు దిగుతున్నారెందుకు..? రాష్ట్రం ఏదైనా, ప్రాంతం ఏదైనా నేడు దేశంలో రైతులు అడుగుతున్నదేమిటి? చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలంటున్నారు. రుణమాఫీని తక్షణమే అమలు చేయమంటున్నారు. గిట్టుబాటు ధర కల్పించాలంటున్నారు. బలవంతంగా భూములు గుంజుకుని నిర్వాసితుల్ని చేయొద్దని వేడుకుంటున్నారు. కానీ బీజేపీ చేస్తున్నదేమిటీ? వారి న్యాయమైన కోర్కెలను పెడచెవిన పెడుతున్నది. ఆందోళనకు దిగితే క్రూర అణచివేతకు పూనుకుంటున్నది. కాల్పులకు సైతం ఒడిగడుతున్నది. ఈ కాల్పుల్లో మధ్యప్రదేశ్‌లో ఆరుగురు రైతులను బలితీసుకున్నది. వందలాదిమంది రైతుల రక్తం కండ్లజూసింది. మహారాష్ట్రలో రైతులపై పెల్లెట్‌గన్స్ ప్రయోగించింది. పన్నెండుమంది రైతులను క్షతగాత్రులను చేసింది. ఇంత జరుగుతుంటే సమస్యను పరిష్కరించాల్సిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శాంతికోసం దీక్షకు కూర్చుంటారు..! మరో మంత్రి సినిమాహాల్లో టికెట్లు అమ్ముకుంటారు..! ఇంకో మంత్రి ఎన్నికల కమిషన్‌కు తప్పుడు లెక్కలు చూపినందుకు అనర్హతకు గురవుతారు. ప్రధాని మాత్రం ఉలుకూ పలుకూ లేకుండా యోగముద్రలో లీనమవుతుంటారు. తమకు పెట్టని కోట అని చెప్పుకుంటున్న ఉత్తరప్రదేశ్‌లో కూడా వేలాదిగా రైతులు రోడ్లమీదకొచ్చి శవాసనాలేసి నిరసన తెలుపుతున్నా ఆయన కండ్లు తెరువకపోవడం రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయిస్తూ కూర్చున్న నీరో చక్రవర్తిని తలపిస్తున్నది. నోరు తెరిస్తే రైతులపై అపారమైన ప్రేమ కురిపించే ఏలికల నాలుకలు ఇప్పుడు మాట మారుస్తున్నాయి. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని అడగటమే పాపమైంది. ఒక వ్యవసాయ విధానమంటూ లేని ప్రభుత్వాలు ఎంతసేపటికీ వ్యాపార వర్గాల ప్రయోజనాలనే తప్ప ఉత్పత్తిదారులైన రైతుల ప్రయోజనాలను చూడటం లేదు. నిజానికి వ్యవసాయరంగంలో వచ్చిన మార్పుల వలన పంటల దిగుబడి పెరిగింది. ఆ మేరకు పెట్టుబడులూ పెరిగాయి. దీంతో పెరిగిన దిగుబడులకు తగిన గిట్టుబాటు ధర రాక అయినకాడికి అమ్ముకోక తప్పని పరిస్థితి రైతులకొచ్చింది. ఫలితంగా పెట్టుబడికోసం చేసిన అప్పులు పేరుకుపోయి ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. దీనిని పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకపోగా రైతును వ్యవసాయానికి దూరం చేసి కార్పొరేట్లను వ్యవసాయంలోకి ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తున్నది. ఫలితమే నేటి వ్యవసాయ సంక్షోభం...! ఎన్నికల ముందు రుణమాఫీ అన్నారు. కొత్తగా రుణసాయం అందిస్తామన్నారు. పంట సాగులో పెట్టుబడికి అదనంగా 50శాతం లాభంతో మద్దతు ధర కల్పిస్తామన్నారు. మూడేండ్ల కింద చెప్పిందే చేయండని అడుగుతున్నారు రైతులు. ఇచ్చిన మాట నిలబెట్టుకోనందుకు సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి, అణచివేతలు, అపహాస్యాలను కానుకగా ఇస్తారా..!? ఇదేనా బీజేపీ సుపరిపాలన..?

# నిప్పుల కొలిమి

నాంపల్లి, మేజర్‌న్యూస్ : రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారింది. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. నీళ్లు లేక జనం గొంతెండుతోంది. రోళ్లు పగులుతున్నాయి. భూపాలపల్లి జిల్లా చెల్పూరులో 50 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. ప్రజలు అతలాకుతలమవుతున్నారు. భద్రాద్రిలో భార్యభర్తలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఎండవేడిమిని తట్టుకోలేక సూర్యోద్రేకానికి భస్మీపటలమైంది. 1901 నుండి నేటి వరకు ఇంత ఘనం ఎండలు ఎప్పుడూ నమోదు కాలేదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సూర్యుడి ఉగ్రతాపానికి ఉష్ణోగ్రతలు పైకి ఎగబాకుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు ముందే హెచ్చరించారు. అయినా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. నల్లగొండ జిల్లాలో రైతు సమగ్ర సర్వేకు వెళ్లిన ఏఈఓ వడదెబ్బ తాకి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పెద్దపల్లి జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్త విధులు ముగించుకుని వస్తుండగా వడగాలి తగిలి జ్వరంతో మరణించింది. పొలంలో మంటలు ఆర్పేందుకు వెళ్ళిన ఇద్దరు రైతులు సజీవదహనమయ్యారు. తెలుగురాష్ట్రాలలో రోజుకు సగటున 20మందికి పైగా సూర్యతాపానికి బలవుతున్నారు. సాధారణం కన్నా 5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగితే వడగాలులుగా గుర్తిస్తారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే ప్రజలు వడదెబ్బకు గురవుతారు. ఆరోగ్యశాఖ తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 6384 మందికి వడదెబ్బ తగిలినట్టు ప్రకటించారు. 171 మంది చనిపోయినట్టు ప్రకటించారు. ఈ లెక్కలు ప్రభుత్వ ఆస్పత్రిలో నమోదైనవి మాత్రమే. ఇంకా ప్రయివేటు ఆస్పత్రులలో లెక్కలు తీసుకుంటే ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గత నాలుగేండ్లలో వడదెబ్బకు దేశవ్యాపితంగా 4620 మంది చనిపోయారు. అందులో తెలుగు రాష్ట్రాల ప్రజలే 90శాతం పైగా ఉన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో 4246 మంది వడదెబ్బకు చనిపోవడం ఆందోళన కలిగించింది. ఇందులో ఎక్కువమంది ఉపాధి కూలీలూ గొర్రెల కాపరులూ కావడం విచారకరం. ప్రభుత్వం ఉపాధి కార్మికులకు నీడ, నీళ్ళు ప్రాథమిక వైద్య సౌకర్యాల ఏర్పాటులో విఫలమైంది. ఫలితంగా పేదల మరణాలకు కారణమైంది. ఇప్పుడు తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా అందుకు భిన్నంగా ఏమీలేదు. రోజూ వివిధ శాఖల పనితీరుపై తీరికలేకుండా సమీక్షలు జరుపుతున్న పాలకులు వడదెబ్బ మరణాలపై ఎందుకు సమీక్ష జరపడం లేదో ఆలోచించుకోవాలి. ఉపాధి పనులు జరుగుతున్న ప్రతిచోటా కూలీలు వడదెబ్బకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలి.

సూర్య




# అనాథ శవానికి అంతిమ దాన సంస్కారం

## ఊరంతా ఆయనకు బంధువులే

## కడసారి వీడ్కోలు పలికి రుణం తీర్చుకున్న గ్రామం ప్రజలు






హాలియా, మేజర్‌న్యూస్ : అనుముల మండల పరిధిలోని పేరూరు గ్రామంలో నా అన్నవారు లేకున్నప్పటికి గత 30 సంవత్సరాలుగా మోహన్ రావు నివాసం ఉంటు పేరూరు గ్రామ ప్రజలతో అవినాభావ సంబంధంగా ఊర్లో వారిని వరుసలు పెట్టి అమ్మానాన్న అన్నా వదిన అక్క బావ తమ్ముడు చెల్లి అని ప్రేమగా పలకరిస్తూ ఆత్మీయత పొందాడు. మోహన్ రావుకు ఆస్తిపాస్తులు లేవు, ఎక్కడి నుంచి వచ్చాడో, గత 30 సంవత్సరాల నుండి ఇక్కడే జీవనం సాగించాడు. ఒక తప్పు కూడా చేయలేదు. ఆకలైనప్పుడు అమ్మ అని ఇంటి దగ్గర రావడం పైసలు అవసరం ఉంటే అడుక్కోవడం తప్ప ఇతర ఏ అలవాటు లేదు. సాదాసీదా జీవనంతో అందరితో కలిసి మాట్లాడే వారు. అటువంటి మనిషి నేడు మరణించడం చాలా బాధాకరం.మన గ్రామ ప్రజలందరూ మోహన్ రావు అంతిమ యాత్రకు సహాయ, సహకారం అందించడం జరిగినది. ప్రజలు అందరూ కలిసి ఊరేగింపుతో పారేయడం జరిగింది.

# వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

## అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులని గుర్తించి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి

## జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



చివ్వెంల మేజర్ న్యూస్‌: వాతావరణంలో మార్పుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎండకు తోడు వడగాలులు, ప్రకృతిలో మార్పులు వర్ష వస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో అన్ని శాఖల జిల్లా అధికారులతో కలిసి వడదెబ్బ సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉష్ణోగ్రత పెరుగుతున్న దృష్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు చే యాలని తెలిపారు. వడదెబ్బ బారిన పడితే 108కు సమాచారం ఇస్తే సిబ్బంది చేరుకొని చికిత్స అందిచి దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్తారన్నారు. ప్రతి మండలంలో మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలతో కూడిన టీం ఏర్పాటు చేశామని వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారితో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. మద్యం, కాఫీలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కోటచలం, జిల్లా టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డిడబ్ల్యూఓ వెంకటరమణ, ఎహెచ్ఓ ఏ. కుమార స్వామి, డిపిఓ కె. సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత



కొండమల్లేపల్లి మేజర్ న్యూస్‌: మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో నమ్మదగిన సమాచారం మేరకు దేవరకొండ రోడ్డు కొండమల్లేపల్లిలో అక్రమంగా మైనింగ్ నిబంధనలకు విరుద్దంగా ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకోవడం జరిగిందని కొండమల్లేపల్లి ఎస్సై రాముూర్తి తెలిపారు. కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోబడునని, అదేవిధంగా అక్రమంగా ఇసుక రవాణీ చేస్తున్న ట్రాక్టర్ యజమానులకు పోలీసు వారి తరుపున హెచ్చరిక జారీ చేశారు. నిబంధనలకు విరుద్దంగా అక్రమ రవాణా చేస్తే పట్టుకొని కేసులు చేసి ట్రాక్టర్లను సీజ్ చేయబడునని ఎస్సై రామ్మూర్తి తెలిపారు.

# అంగన్వాడీలకు నష్టపరిచే 1334జీ.ఓలను రద్దు చేయాలి

## దండెంపల్లి సత్తయ్య



నల్గొండ టౌన్, మేజర్‌న్యూస్ : అంగన్వాడీ టీచర్లు హెల్పర్లకు నష్టం కలిగించే సర్కులర్ 1334 వెంటనే ఉపసంహరించుకోవాలని, గత సంవత్సరంలో చేసిన సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నలగొండ ప్రాజెక్టు కార్యదర్శి కే.సముద్రమ్మలు డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నల్లగొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ బాసిద్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ గతంలో అంగన్వాడి యూనియన్ ఆధ్వర్యంలో 24 రోజుల పాటు సమ్మె చేసి పోరాటాల ద్వారా సాధించుకున్న టీచర్‌కు రెండు లక్షలు ఆయాకు ఒక లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను యధావిధిగా అమలు చేస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చి ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రభుత్వం 1334 ఐసిడిఎస్ సర్కులర్ ద్వారా లక్ష రూపాయలు మాత్రమే బెనిఫిట్స్ ఇస్తామని చెప్పి 65 సంవత్సరాలు నిండిన టీచర్లు ఆయాలను ఇంటికి పంపేందుకు సిద్ధమైందని సంవత్సరాల తరబడి ప్రజలకు సేవన అందించినటువంటి వారిని అమాంతరంగా ఇంటికి పంపడం అంటే ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే సర్కులర్ 1334 ఉపసంహరించుకొని, టీచర్‌కు రెండు లక్షలు, హెల్పర్‌కు లక్ష రూపాయల రిటర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు కనీస వేతనం 26 వేల రూపాయలు, పని భారం తగ్గించడం, ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యాలతో పాటు పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కొత్త ప్రభుత్వం అంగన్వాడీల కోరికలను పరిశీలించి కొత్త ఉత్తర్వులు ఇవ్వాల్సిన ప్రభుత్వం గతంలో అంగన్వాడీ టీచర్లు ,హెల్పర్లు వ్యతిరేకించిన పాత జీవో ఉత్తర్వులనే మళ్లీ ముందుకు తెచ్చి అమలు చేయాలని చూడడం సోషనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడీ ఉద్యోగుల మనోభావాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఆర్థికంగా నష్టం కలిగించే విధమైన చర్యలు చేపడుతూ ఏకపక్షంగా, వేగవంతంగా ముందుకు పోతుందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అంగన్వాడీ ఉద్యోగులకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను అమలు పరచకపోవడమే కాకుండా, గత ప్రభుత్వ హామీలను కూడా అమలు చేయకుండా అంగన్వాడీ ఉద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం పునరాలోచన చేసి అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, సర్కులర్ 1334 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, సలివొజు సైదాచారి, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నలగొండ ప్రాజెక్టు ఉపాధ్యక్షురాలు పాదూరి లక్ష్మీ,యల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

# ఎండలు వడగాలులు పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - హుజూర్‌నగర్ మండల వైద్యాధికారి డాక్టర్ పుష్పలత

హుజూర్‌నగర్, మేజర్‌న్యూస్ : ఎండలు వడగాలులపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హుజూర్‌నగర్ మండల వైద్యాధికారి డాక్టర్ పుష్పలత అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇటుక బట్టికూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి వారు మాట్లాడుతూ వడదెబ్బ లక్షణాలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నాయని,ఎండ తీవ్రతలో పనిచేయడం వలన శరీరంలో చెమట ద్వారా డిహైడేషన్ జరిగి వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉండి, అపస్మారకస్థితిలోకి వెళ్ళడం ద్వారా వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాల న్నారు.ప్రజలు తరుచుగా మంచినీళ్ళు సేవిచండం,మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్ళు, పండ్ల రసాలు తీసుకోవాలని సూచించారు.మండల వ్యాప్తంగా అంగన్‌వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలు , ఉపాధిహమీ పనులు జరిగే చోట ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యసేవలు వినియోగించు కోవాలన్నారు.ఈ కార్యాక్రమం లో పిహెచ్ఎన్ నూర్జహన్‌బేగం, హెల్త్ అసిస్టెంట్ ఇందిరాల రామకృష్ణ, ఆశాకార్యకర్తలు, కార్మికులు, పాల్గొన్నారు.

# అరణ్యం

తిప్పర్తి, మేజర్‌న్యూస్ : అడవులు భద్రంగా ఉంటే మనుషులు క్షేమంగా ఉంటారు. ఈ చిన్న విషయం తెలియక కాదు, తెలిసీ అడవుల విధ్వంసాన్ని ఆపలేకపోవడం ఆధునిక మానవుని దుస్థితి. మరీ ముఖ్యంగా సంపన్న వర్గాల, సంపన్నదేశాల విధానాలు అడవుల క్షయానికి దారితీస్తున్నాయి. ఇటీవల అమెజాన్ అడవులు దగ్ధం కావడం పర్యావరణవేత్తల్ని, ప్రకృతి ప్రేమికుల్ని తీవ్ర ఆందోళనకు లోను చేసింది. ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. తమ అభివృద్ధికి ఆటంకమైతే అడవుల్ని ఉపేక్షించడం సాధ్యం కాదన్నది పాలకుల సమాధానం.

మన దగ్గర నల్లమల్లలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా వినిపించిన తీవ్ర నిరసనల నేపథ్యంలో వాటిని అనుమతించబోమని పాలకులు చెప్పారు. అయినప్పటికీ ఆచరణలో ఏం జరుగుతుందన్నది ప్రశ్నే.. ఆదిమానవుల నివాసం అరణ్యమే. అరణ్యాల్ని దాటుకొని ప్రయాణించే క్రమాన చెట్లని నరికివేసి, వ్యవసాయయోగ్యమైన భూములుగా మార్చారు. అంతమాత్రాన ఇవాళ భారీ ప్రాజెక్టులు, మైనింగ్ తవ్వకాల కోసం వేలాది హెక్టార్ల అడవుల్ని నిర్మూలించడం క్షంతవ్యం కాదు. ఎందుకంటే జీవవైవిధ్యం సమతుల్యం మీదనే మానవుని జీవనం ఆధారపడి ఉంది. ఉత్తరాఖండ్‌లో ఉవ్వెత్తున వచ్చిన వరదలకు, అక్కడ కొండల మీద నిర్మించిన ప్రాజెక్టులే కారణమని పర్యావరణవేత్తలు తేల్చిచెప్పారు.

మానవుని అవసరాలకు అనుగుణంగా అడవుల్ని ఉపయోగించుకోడంలో తప్పులేదు. అడవుల్లోని జీవ వైవిధ్యానికి, పచ్చదనానికి భంగం కలగకుండా వాటిని వినియోగించుకునే విధివిధానాల్ని అనుసరించాలి. దీనికి భిన్నంగా అడవుల్ని నేలమట్టం చేయడం దుర్మార్గం. ఇది కూర్చున్న చెట్టు కొమ్మను తానే నరుక్కోవడం వంటి ఆత్మహత్యాసదృశ్యమైన చర్య.

ఈ సత్యం అందరికీ తెలుసు. అయినా లక్షల హెక్టార్ల అడవుల నిర్మూలనకు ప్రభుత్వాలు అనుమతించడం వైచిత్రి. కలపదొంగల వల్ల, జంతువుల్ని వేటాడేవారి వల్ల జరిగే నష్టం చాలా చిన్నది. వీరితో పో లిస్తే అడవి ఉనికిని దెబ్బతీసే ప్రభుత్వ విధానాలు అడవులకీ, వాటిని అంటిపెట్టుకొని ఉన్న జనాలకీ తీవ్రమైన శరాఘాతం. ఒకవైపు అటవీభూభాగ విస్తీర్ణం తగ్గిపోతుంటే మరోవైపు ఈ విస్తీర్ణం పెరుగుతున్నట్టుగా ప్రభుత్వం చెబుతున్నది. ఇది అంకెల గారడీ. ఒకప్పుడు మన దేశంలో 30శాతానికి పైగా అడవులు విస్తరించి ఉండేవి. ఇవుడు దేశ భూభాగంలో అటవీ విస్తీర్ణం 21.34శాతం మాత్రమే. దట్టమైన అరణ్యాల జోలికి అసలు వెళ్ళకూడదని అంతర్జాతీయంగా పర్యావరణవేత్తలు పదేపదే చెబుతున్నారు. కానీ మన దేశంలో భారీ డ్యాంల కోసం, రక్షణ విభాగం, జలవిద్యుత్ ప్రాజెక్టులు, గనుల నిర్మాణం కోసం దట్టమైన అరణ్యాల్ని సైతం నిర్మూలిస్తున్నారు. దీని ప్రభావం దీర్ఘకాలికం. జీవవైవిధ్యం దెబ్బతినడమే కాక అకాల వర్షాలు, తుఫాన్లు, వరదలు, భూకంపాలు తలెత్తడానికి దారితీస్తుంది.

అభివృద్ధి జరగాలంటే అడవులు అంతరించక తప్పదనే వాదన ముందుకు తెస్తున్నారు. అభివృద్ధి ఎవరికోసం, ఎందుకోసమనే ప్రశ్నలకు సరయిన జవాబు ఉండదు. దేశీయ పెట్టుబడిదారులకోసం, బహుళజాతి కంపెనీల కోసం అడవుల్ని నిర్మూలించడాన్ని భవిష్యత్ తరాలు క్షమించవు. అడవుల్ని నరికివేసే క్రమాన ఎన్ని చెట్లను కోల్పోతారో, అన్ని చెట్లను ప్రత్యామ్నాయంగా మరోచోట పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రకారం కృత్రిమంగా మొక్కల పెంపకం కార్యక్రమాలు చేపడుతున్నారు. కానీ అరణ్యమంటే కేవలం చెట్లు కాదు, పక్షులు, జంతువులు, నేల, అక్కడ నివసించే మానవులు... ఇంకా అపారమైన జీవవైవిధ్యం. వాటిని మరోచోట వున:ప్రతిష్టించడం సాధ్యం కాదు. యురేనియం కోసం నల్లమలని నాశనం చేస్తే మరోచోట దానిని అంతే సహజసిద్ధంగా నిర్మించగలరా? ఇవాళ దగ్ధమవుతున్న అరణ్యాల్ని మరల సృజించడం సాధ్యమా?

ప్రకృతి ప్రసాదించిన అపురూప వరాలు అరణ్యాలు. మానవాళికి అవాసంగా, ఆసరాగా ఈ అరణ్యాల గొప్పతనాన్ని, వాటి సహజ సౌందర్యాన్ని విభూతి భూషణ్ బందోపాధ్యాయ 'వనవాసి' నవలలో అద్భుతంగా చిత్రించారు.

సూర్య



# దేశ అభివృద్ధి సంక్షేమం బిజెపి ప్రభుత్వంతోనే సాధ్యం

### – బిజేపీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జి.మనోహార్ రెడ్డి

### – బూర నర్సయ్య గౌడ్ గెలుపుకై ఇంటింట ప్రచారం

### – సొంత గూటికి చేరుకున్న మాజీ సర్పంచ్ వార్డ్ సభ్యులు





మునుగోడు, మేజర్‌న్యూస్ : దేశ అభివృద్ధి సంక్షేమం బిజెపి ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందని బిజేపీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జి.మనోహార్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇప్పర్తి గ్రామంలో భువనగిరి బిజెపి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ గెలిపించాలని కోరుతూ కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బిజెపి కార్యకర్త బూర నర్సయ్య గౌడ్ గెలుపు కొరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.మోడీ ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు.భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నరసయ్య గౌడ్‌ను అత్యధిక మెజార్టీ గెలిపించాలనీ ఓటర్లను అభ్యర్థించారు.అనంతరం కల్వకుంట్ల గ్రామం మాజీ సర్పంచ్ పగిళ్ళ భిక్షం మరియు మునుగోడు 10 వ వార్డు సభ్యులు యర్రబెల్లి శంకర్ రెడ్డి లు ప్రధాని మోది ప్రవేశ పెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిజెపి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జి మనోహర్ రెడ్డి సమక్షంలో సొంత గూటికి చేరుకొని బిజెపి పార్టీలో చేరగా వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తూ బిజెపి కండువా కప్పారు.బీజేపీ మండలం పార్టీ అధ్యక్షులు పెంబళ్ల జానయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు దర్శనం వేణు కుమార్,సోమ నర్సింహ్మా,జిల్లా కార్యదర్శి బొడిగె అశోక్ గౌడ్,బిజెపి ఓ బిసి మోర్చా రాష్ట్ర పబ్లిక్ సిటీ కార్యదర్శి ముంగి ధనుంజయ,బిజెపి రాష్ట్ర నాయకులు భవనం మధుసూదన్ రెడ్డి.బిజెపి జిల్లా నాయకులు బొడ్డు నాగరాజు గౌడ్,బిజెపి ఓ బిసి మోర్చా రాష్ట్ర నాయకులు మాదగోని నరేందర్ గౌడ్,నియెజక వర్గ ప్రచార కార్యదర్శి బండారు యాదయ్య, నాయకులు కంభంపాటి నర్సింహ్మా,కర్నాటి లింగయ్య,కర్నాటి శేఖర్,మెగదాల లింగస్వామి,పందుల యాదయ్య పందుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి ఎంపీగా తనను గెలిపిస్తే నియోజకవర్గంలో ఆగిపోయిన నీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తా

### – భువనగిరి బిజెపి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్





మునుగోడు, మేజర్‌న్యూస్ : భువనగిరి ఎంపీగా తనను గెలిపిస్తే నియోజకవర్గంలో ఆగిపోయిన నీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తానని భువనగిరి బిజెపి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా మునుగోడు మండల కేంద్రంలోని చండూరు రోడ్‌లో సత్య ఫంక్షన్ హాల్ ఎదురుగా బిజెపి మండల పార్టీ కార్యాలయంను ప్రారంభించారు. అనంతరం గడప గడపకు పల్లె పల్లెకు మోడీ అంటూ ప్రచరం చేస్తూ మోడీ చేసిన అభివృద్ధి పనులను కిరాణ షాపుల యాజమానులు మరియు స్థానిక ప్రజలను కలిసి తనకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అదేవిధంగా తాను గతంలో ఎంపీగా ఉన్నప్పుడు నవరాత్రాలు అనే పేరుతో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులను ప్రజలకు తెలిపారు. ఢిల్లీలో మోడీ ,భువనగిరిలో బూర నర్సయ్య గౌడ్ ఉండాలంటే కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. భువనగిరి కోట మీద ఎగిరేది కాషాయ జెండానేనని తెలిపారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలంటే కేంద్రంలో మోడీ అధికారంలోకి రావాలన్నారు.బీజేపీ మండల అధ్యక్షులు పెంబల్ల జానయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డోనూరి వీరారెడ్డి, దాసరి మల్లేశం, అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్,జిల్లా ఉపాధ్యక్షులు దర్శనం వేణు కుమార్, సోమ నరసింహ,ఓబీసీ మోర్చ రాష్ట్ర రాష్ట్ర పబ్లిక్ సిటీ కార్యదర్శి ముంగి ధనంజయ, బిజెపి జిల్లా కార్యదర్శి బొడిగ అశోక్ గౌడ్,రాష్ట్ర నాయకులు భవనం మధుసూదన్ రెడ్డి,బిజెపి జిల్లా నాయకులు బోర్డు నాగరాజుగౌడ్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు నరేందర్ గౌడ్, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి బండారు యాదయ్య, మాజీ జిల్లా కార్యదర్శి వేదాంతం గోపీనాథ్, మండల నాయకులు ఖమ్మంపాటి నరసింహ, కర్నాటి లింగయ్య, బోల్గూరి రమేష్ శిర్గలమల్ల హరిబాబు, గుండెబోయిన శంకర్, కట్కూరి నరేందర్, బోలుగూరు సైదులు తదితరులు పాల్గొన్నారు.

# మౌన యుద్ధం మనిషి మిన్న

తిప్పర్తి, మేజర్‌న్యూస్ ః మనిషికన్నా మనిషి మాటకున్న విలువ మిన్న మనుషుల మధ్య మాటలకున్న విలువ మరీ మిన్న మనుషుల మధ్య మాట కరువైనవుడు శ్మశాన నిశ్శబ్దం రాజ్యమేలుతుందిపభ్రుత్వానికీ ప్రజలకూ మధ్య మాట కరువైనవుడు రాజ్యమే ఒక శ్మశానాన్ని తలపిస్తుంది- అవును! ఇప్పుడు కాశ్మీర్‌లో అదే జరుగుతోంది. ఉగ్రవాదానికి–కేంద్రానికి మధ్య అంటూ మొదలైన యుద్ధం ఇప్పుడు కేంద్ర పాలక పార్టీకి – కాశ్మీర్‌లోని ప్రజాస్వామ్య పార్టీలకూ మధ్య కేంద్రీకృతమైంది. ఫలితంగా కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ముగ్గురూ చెరసాలలో మగ్గుతున్నారు. భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరుగుని విపరీతమిది. తలచుకుంటేనే వొళ్లంతా జలదరించే అనూహ్యమైన అప్రజాస్వామిక పరిణామమిది. మరీ ముఖ్యంగా భారతదేశ జాతీయజెండా కాశ్మీర్‌లో సగర్వంగా ఎగిరేందుకు జీవితాంతం చావుకు ఎదురీది శ్రమించిన 81ఏండ్ల కురువృాఎద్దుడు, మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లాను అరెస్టు చేయడం. ఫరూఖ్ అబ్దుల్లా విషయంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పరమ దుర్మార్గమైనది. ఆర్టికల్ 370ని రద్దు చేసిన ఆగస్టు 5 నుంచే ఫరూఖ్‌ను గృాఎహనిర్బంధంలో ఉంచారు. ఆగస్టు 6న కేంద్ర హౌం మంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రసంగిస్తూ ఫరూఖ్‌ను అరెస్టు చేయడం కానీ, నిర్బంధంలోకి తీసుకోవడం కానీ జరగలేదని నిస్సిగ్గుగా పచ్చి అబద్ధమాడారు. దీంతో తమిళనాడుకు చెందిన ఎండీఎంకే నేత వైగో ఫరూఖ్ ఎక్కడున్నారో చెప్పాలంటూ సుప్రీం కోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్ దాఖలు చేయడంతో ఆయనను అరెస్టు చేసినట్టు ప్రకటించారు.

సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే తరిగామితో సహా కాంగ్రెస్, నేషనల్ కాంగ్రెస్, పీవుల్స్‌డెమోక్రటిక్ ఫ్రంట్.. పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములైన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలంతా ఇప్పుడు నిర్బంధంలో మగ్గుతున్నారు. ఇన్నాళ్ళూ కాశ్మీర్ ప్రజల గొంతుకగా ఉన్నవారు, వేర్పాటువాదుల నుంచి పొంచి ఉన్న ముప్పుకు బెదరకుండా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వాళ్ళంతా జైళ్ళల్లో మగ్గుతున్నప్పుడు ఇక అక్కడ రాజకీయ ప్రక్రియకు తావెక్కడిది? దశాబ్దాలుగా రగులుతూ ఉన్న కాశ్మీర్ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు వీలెక్కడిది? అంటే, కేంద్ర ప్రభుత్వం కాశ్మీర్ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించేందుకు సిద్ధంగా లేదని మనకు అర్థమవుతున్న అంశం. మరి, రాజకీయ ప్రక్రియకు పూర్తిగా తలువులు మూసేసిన కేంద్రం ఇప్పుడు అక్కడ ఏమి చేయబోతోంది? మాటలకు (చర్చలకు) మార్గం మూసేసిన తరువాత ఏమి జరుగుతుంది? మరింతగా నిర్బంధం పెరుగుతుంది. మరిన్ని వేలమందిని జైళ్ళల్లో కుక్కేస్తారు. కాశ్మీర్‌లో జైళ్ళు చాలకపోతే దేశంలోని జైళ్ళన్నిటికీ కాశ్మీరీయులను తరలిస్తారు. నిజానికి ఇప్పటికే ఆ తరలింపు మొదలయ్యింది. ఇంటికొక్కరు, ఆ ఇంటిని పోషించాల్సిన అవసరం, శక్తి ఉన్నవాళ్ళు ఇంటికి దూరమైన తరువాత ఆ కుటుంబం, కుటుంబానికి దూరమై జైలులో ఉన్న వ్యక్తి డీలా పడిపోతాడనీ, తీవ్ర నిరాశలో, నైరాశ్యంలో కూరుకు పోతారనీ, ఎంత ప్రతిఘటించినా వ్యర్థం, అత్యంత బలమైన రాజ్యంతో ఢకోని తాము అనుకున్నది సాధించడం అసాధ్యమన్న నిర్ణయానికి వచ్చి సర్కారుతో రాజీ పడతారనీ, ఉన్న దాంతో సర్దుకుపోవడం అలవర్చుకుని అణగిమణగి పడిఉంటారనీ.. కేంద్రంలోని కాషాయ ప్రభుత్వం భావిస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే కేంద్రంలోని బీజేపీ సర్కార్ కాశ్మీర్ ప్రజలపై మానసిక యుద్ధం చేస్తున్నదిప్పుడు. చుట్టూ నిశ్శబ్దాన్ని నింపి, నిశ్శబ్దంలో జనాన్ని నింపి, ఆ మాటలు లేని మౌన జీవితంతో జనం విసిగివేసారిపోయేలా చేసి లొంగదీసుకోవాలని చూస్తోంది.

కాశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పూర్తిగా సమర్థనీయమని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రకటించిన తరువాత ఇక ప్రజలకు ప్రత్యామ్నాయం ఎక్కడిది? తమకు జరుగుతున్న అన్యాయాన్ని, తమపై జరుగుతున్న దౌర్జన్యాన్ని జనం ఎక్కడికెళ్లి విన్నవించుకోవాలి? తమకు న్యాయం జరిగేలా చూడాలని ఎవరిని వేడుకోవాలి? అలా విన్నవించుకునే, వేడుకునే అవకాశం లేకుండా చేయడమే నరేంద్ర మోడీ సర్కారు ఎత్తుగడ. ప్రత్యామ్నాయం కోల్పోయిన జనం అనివార్యంగా తాము చెప్పినట్టు వింటారని, తమ కాళ్ల చెంత పడి ఉంటారనీ కమలనాథుల నమ్మకం.

నిజమే! లోపల రగులుతున్న అగ్నిపర్వతం కూడా బద్ధలయ్యే వరకూ పైకి ప్రశాంతంగానే కనిపిస్తుంది. అంతమాత్రాన అది బద్దలయ్యేవరకు తనలోపల ఉన్న గుణాన్ని కోల్పోయినట్టు కాదు. ప్రజలూ అంతే. జీవితం తమలో రగిలించిన తిరుగుబాటు తత్వాన్ని ఆశయం సిద్ధించేంత వరకూ అస్సలు కోల్పోరు. ప్రతికూల పరిస్థితుల ప్రభావంతో లోలోన అణచుకుంటారు. అదనుచూసి అగ్నిపర్వతమై బద్ధలవుతారు.

# నిజాయితీ నిరూపించుకోవాలి

మిర్యాలగూడ, మేజర్‌న్యూస్ ః యురేనియం తవ్వకాలపై ముఖ్యమంత్రి మూడ్రోజుల క్రితం నోరు విప్పారు. నల్లమలలోనే కాదు రాష్ట్రంలో ఎక్కడా యురేనియం తవ్వకాలకు అనుమతీయబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉభయసభల్లో ఏకవాక్య తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా సీఎం మరో అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రత్యేకరాష్ట్రం ఏర్పడ్డనాటి నుంచీ ఎవరికీ, ఏవిధమైన అనుమతులూ యివ్వలేదన్నారు. ఇక మీదట ఇవ్వబో మనీ తెలిపారు. ఆలస్యంగానైనా సీఎం స్పందించడం, ప్రభుత్వ వైఖరి చెప్పడం శుభపరిణామం. రాష్ట్రాన్ని చుట్టు ముట్టిన యురేనియం ముప్పుపై పోరు చేస్తున్న జనావళికి ఈ పరిణామాలు నైతికబలాన్నిస్తాయ నడంలో సందేహం లేదు. అదే సందర్భంలో ఇక అంతా రాష్ట్ర సర్కారే చూసుకుంటుందిలే.. అనే భ్రమలూ అక్కర్లేదని పర్యావరణ వేత్తలూ రాజకీయ విశ్లేషకులూ హెచ్చరిస్తున్నారు. అందుకని ఇప్పటికిప్పుడే ప్రభుత్వాన్ని అనుమానించలేం. కానీ ఆ వైపు సర్కారు నుంచి ఆచరణాత్మక అడుగులు అవసరం. ఈ ప్రకటనలకు మూడ్రోజుల ముందూ తర్వాతా కేంద్రం తన పని తాను చేసుకుపోతూనే ఉన్నది. 'సేవ్ నల్లమల' పేరుతో బయటా, సోషల్‌మీడియా వేదికగానూ వ్యక్తమవుతున్న నిరసనలను ఖాతరు చేయడం లేదు. అందుకు రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు(అటవీ, పర్యావరణ, మైనింగ్) అవసరమైన సాయం చేస్తూనే ఉన్నాయి. సమస్య రాష్ట్రమంతా రగులుతున్న ఈ దశలో ముఖ్యమంత్రికి తెలియకుండా ఈ పని జరుగుతున్నదనుకోలేం. ఉభయ సభల్లో ఏకగ్రీవ తీర్మానం చేసిన రోజు కూడా యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) బృాఎందం అధికారులు నాగర్‌కర్నూల్ సందర్శించారు. స్వయంగా యూసీఐఎల్ లోగోతో ఉన్న వాహనంలోనే ఢిల్లీ నుంచి అధికారులు ఇక్కడ కాలుమోపారు. అటకాయించి నిలదీసిన ఆందోళనకారులకు, ప్రశ్నించిన మీడియాకు మాత్రం మొక్కలు, తొక్కలకోసమొచ్చామని బుకాయించారు. ఆయుర్వేద మందుల తయారీకవసరమయ్యే మొక్కల పరిశీలన, పరిశోధనలు చేస్తున్నట్టు నమ్మబలికారు. ఆ మరుసటి రోజు కూడా ఈ ప్రాంతంలో కేంద్రానికి చెందిన ఓ హెలికాప్టర్ ఏరియల్ సర్వే చేసిందని స్థానికులు చెబుతున్నారు. వెయ్యిమీటర్ల లోతులో వేసిన బోర్ల నుంచి నీళ్లూ మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. భూ సేకరణకు రహస్య సర్వేలు కొనసాగుతూనే ఉన్నాయి.

కేంద్రం నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని, ఏకపక్షంగా పోతున్నదని ఐదేండ్ల పాలనలో అర్థమైంది. రాజ్యాంగ వ్యవస్థల్ని నిర్వీర్యం చేసింది. కార్పొరేట్ అనుకూల విధానాలను మరింత వేగంగా అమలు చేసింది. ఫలితంగానే దేశ ప్రజలు నేడు మాంద్యంలోకి నెట్టబడ్డారు. తాజాగా యురేనియం తవ్వకాలూ వారి ప్రయోజనాల కోసమేనని ప్రజలూ రాష్ట్ర ప్రభుత్వమూ గ్రహించాలి. భూమి లోపల ఉన్న ఈ అణుధార్మిక పదార్థం ఓసారి బయటకొస్తే సంభవించే ముప్పును ఎవ్వరూ ఆపలేరు. యురేనియం అనుభవాలను ప్రత్యక్షంగా చవిచూసిన ధనిక దేశాలు వాటి తవ్వకాల నుంచి క్రమంగా తప్పుకుంటున్నాయి. అగ్రరాజ్యం అమెరికా కూడా 1982 తర్వాత ఈ తవ్వకాలను దాదావు నిలిపేసింది. తవ్వకాలకు వ్యతిరేకంగా ఆ దేశంలో పెద్దఎత్తున ఉద్యమాలూ సాగాయి. ఈ నేపథ్యంలో ధనిక దేశాలు యురేనియంతో నడుస్తున్న అణువిద్యుత్ కేంద్రాలను మూసేశాయి. అభివృాఎద్ధి చెందుతున్న దేశాల్లో దాని వినియోగం పెంచడం ద్వారా తమ అవసరాలు తీర్చుకోవాలని భావిస్తున్నారు. బహుళజాతి సంస్థలు, బడాకార్పొరేట్ల సేవలో తరిస్తున్న మన పాలకులు అందుకు జీ హుజూర్ అంటున్నారు. మన ప్రజలను బలిపశువులను చేసి మరీ దేశ ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారు. ఇందులో మోడీ ముందున్నారు. ఆ విధానాల దుష్ఫలితాలు మనం అనుభవిస్తూనే ఉన్నాం. కేంద్రం నియంత పాలనకు బోలెడు సాక్ష్యాలు మన కండ్లముందే ఉన్నాయి. కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేసిన తీరు దేశ ప్రజలకు తెలుసు. ప్రజాభీష్టం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని చెబుతూనే వేలాదిమంది సాయుధులతో ప్రజా తిరుగుబాట్లను అణిచింది.

# 23 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించిన రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ



హైదరాబాద్ మేజర్ న్యూస్ : నేడు ప్రకటించిన యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ 2023 ఫలితాలలో, హైదరాబాద్ లో అశోక్ నగర్ లోని రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ, విద్యార్థులు 23 కి పైగా ఆల్ ఇండియా సర్వీసులు సాధించి విజయ పరంపర కొనసాగించారు. 2021 ఫలితాల్లో 6 విద్యార్థులు, 2022 ఫలితాల్లో 15 మంది విద్యార్థులు నేటి 2023 ఫలితాల్లో 23 కి పైగా మంది విద్యార్థులు అకాడమీ నుండి సర్వీసులు సాధించడం చాలా సంతోషంగా, స్ఫూర్తిదాయకంగా ఉందని అకాడమీ డైరెక్టర్స్ డాక్టర్ గడియారం వివేకానంద, శ్రీ రామ్ ముప్పాళ్ళ, మరియు సి ఎల్ న్ ధవేజీ తెలిపారు. పత్రికా సమావేశం లో రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ నుండి దోనూరు అనన్య రెడ్డి (ఏఐఆర్-3) , నందల సాయికిరణ్ ( ఏఐఆర్27), బెంజో ప్ జోస్ ( ఏఐఆర్-59), రావుల జయసింహ రెడ్డి (డి దోనూరు అనన్య రెడ్డి (ఏఐఆర్-3) , నందల సాయికిరణ్ ( ఏఐఆర్27), బెంజో ప్ జోస్ ( ఏఐఆర్-104), అశ్విన్ మని దీప్ కాకుమాను ( ఏఐఆర్-148), సుషీర్ శ్రీకృష్ణ ( ఏఐఆర్-155), వినీత్ లోహిదక్షన్ ( ఏఐఆర్-169), పెంకీసు ధీరజ్ రెడ్డి ( ఏఐఆర్-173), బి సహరిత ( ఏఐఆర్-217), బన్న వెంకటేష్ ( ఏఐఆర్-467), కే శ్రీనివాసులు ( ఏఐఆర్-526), కొయ్యడ ప్రణయ్ కుమార్ ( ఏఐఆర్-554), మర్రిపాటి నాగ భరత్ (డి దోనూరు అనన్య రెడ్డి (ఏఐఆర్-3) , నందల సాయికిరణ్ ( ఏఐఆర్27), బెంజో ప్ జోస్ ( ఏఐఆర్-580), పోటువు రెడ్డి భార్గవ్ ( ఏఐఆర్-590), కె అర్పిత ( ఏఐఆర్-639), చౌహన్ రాజ్ కుమార్ ( ఏఐఆర్-703), గాదె శ్వేత ( ఏఐఆర్711), కొలనుపాక సహన ( ఏఐఆర్-739), ఆధ సందీప్ కుమార్ ( ఏఐఆర్-830), కే శశికాంత్ ( ఏఐఆర్-891), అనుప్రియ నినావత్ ( ఏఐఆర్914), రావూరి సాయి అలేఖ్య ( ఏఐఆర్-938) మరియు జటోత్ శ్రావతి ( ఏఐఆర్ ఏఐఆర్985) లతో కలిపి మొత్తంగా 23 మంది ర్యాంకులు సాధించారు 2030 నాటికి 100 మంది ఐఏఎస్ మరియు 100 మంది ఐపీఎస్ లను దేశానికి అందించడమే అకాడమీ లక్ష్యంగా పెట్టుకుందని ఆ దిశగా ఈ ఫలితాలు ఉండటం ఆనందాన్ని ఇస్తుందని, 2014లో విజేతగా నిలిచి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ సాధించిన అకాడమీ చీఫ్ మెంటర్ డాక్టర్ గడియారం వివేకానంద తెలిపారు....

# ధర్మ బద్ధమైన జీవితానికి నిలువెత్తు రూపం శ్రీరాముడు : ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్ మేజర్ న్యూస్ : ధర్మ బద్ధమైన జీవితానికి నిలువెత్తు రూపం శ్రీరాముడని, మనిషి ఇలా బతకాలి అంటూ ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపాడు కాబట్టే శ్రీరాముడిని అందరూ పురుషోత్తముడని పిలిచారని, సర్వోన్నతమైన ఆదర్శాలకు నిలువెత్తు రూపం శ్రీరాముడని, శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు, పార్టీ శ్రేణులు శంభీపూర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీరామ నవమి వేడుకలకు రావాలని ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానించారు.



# నాలుగు నెలల శిశువుకు అత్యంత క్లిష్టమైన ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స



హైదరాబాద్ మేజర్ న్యూస్ : అంకుర హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ , వైద్యపరంగా ఒక అద్భుతమైన విజయాన్ని సాధించింది. కేవలం నాలుగు ( 4 ) నెలల వయసున్న శిశువుకు సంక్లిష్టమైన ఊపిరితిత్తుల శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా ఈ మహాద్భుతాన్ని ఆవిష్కరించింది. అంకుర హాస్పిటల్ యొక్క బంజారాహిల్స్ బ్రాంచ్లో పీడియాట్రిక్ సర్జరీ బృందం ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. గర్భంలో ఉండగానే , పుట్టుకతో వచ్చే పల్మనరీ ఎయిర్వే మాల్ఫార్మేషన్తో సమస్యతో బాధపడుతున్న శిశువులకు ఎదుగుదల సమస్యలు రావడం తో పాటుగా, శిశువు అభివృద్ధిని ప్రభావితం చేసే సంభావ్య సమస్యలు కూడా రావచ్చు. అలాగే భవిష్యత్తులో క్యాన్సర్ అభివృద్ధి ముప్పును నివారించడానికి తక్షణ జోక్యం అవసరం.అని పీడియాట్రిక్ సర్జరీ మరియు పీడియాట్రిక్ యూరాలజీ యొక్క చీఫ్ సర్జన్ డాక్టర్ వివిఎస్ చంద్రశేఖరం అన్నారు థొరాకోస్కోపిక్ లోబెక్టమీతో సహా అధునాతన సాంకేతికతలను ఉపయోగించి, శస్త్రచికిత్స నిపుణులు అతి తక్కువ కోత పద్ధతుల ద్వారా ఊపిరితిత్తులలో వ్యాధి భాగాన్ని విజయవంతంగా తొలగించారు. ఇలాంటి దురదృష్టకర సమస్యల నుండి పిల్లలను రక్షించడంలో సకాలంలో గుర్తింపు మరియు జోక్యం చాలా ముఖ్యమైనవి అని అంకుర హాస్పిటల్ ఫర్ విమెన్ అండ్ చిల్డ్రన్ కి చెందిన పీడియాట్రిక్ సర్జరీ మరియు పీడియాట్రిక్ యూరాలజీ చీఫ్ సర్జన్ డాక్టర్ వివిఎస్ చంద్రశేఖరం అన్నారు. ఊపిరితిత్తులలో పుట్టుకతో వచ్చే క్రమరాహిత్యాలు 1 లక్ష మంది శిశువులలో 30-42 మందిలో కనిపించే అరుదైన అంశం. ఈ సమస్యలను సకాలంలో గుర్తించడం వల్ల పెద్దయ్యాక వినాశకరమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు మరియు క్యాన్సర్ల నుండి పిల్లలను రక్షించవచ్చు . వారు ఆరోగ్యకరమైన వ్యక్తులుగా ఎదగడంలో సహాయపడుతుంది. అని అన్నారు.

# సంక్షేమ, కుల సంఘాల ఆత్మీయ సమ్మేళన సభలో పాల్గొన్న పట్నం సునీత మహేందర్ రెడ్డి

జీడిమెట్ల మేజర్ న్యూస్ : 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని గాయత్రీ నగర్ లో గల టిఎన్ఆర్ గార్డెన్స్ లో అలాగే 131 కుత్బుల్లాపూర్ డివిజన్, 129 సూరారం డివిజన్, 130 సుభాష్ నగర్ డివిజన్ లలో సంక్షేమ, కుల సంఘాల ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి మల్కాజ్గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్గా పది సంవత్సరాలు మీకు సేవలు అందించిన అనుభవం ఉందన్నారు. నేను మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మీయొక్క సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నేను లోకల్ కాదు అని ప్రతిపక్ష పార్టీల వారు అంటున్నారు. అసలు వారు నాన్ లోకల్ ఒకరేమో కరీంనగర్ నుంచి మరొకరేమో వరంగల్ నుంచి వచ్చారన్నారు. తనను గెలిపిస్తే అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందిస్తూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్, మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు, మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలను హనుమంత్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కోఆర్డినేటర్ శోభారాణి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కె.పి.విశాల్ గౌడ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరి వర్ధన్ రెడ్డి, టి పి సి సి కార్యదర్శులు జోష్ణ శివారెడ్డి, భూపతిరెడ్డి, వునారెడ్డి, మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి 132 జీడిమెట్ల డివిజన్ మహిళాకాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నాగలక్ష్మి, 132 జీడిమెట్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బేకు శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు ఆవిర జేమ్స్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోరిగే బాలప్ప, సంతోష్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు యం.డి. రషీద్, గార శ్రీనివాస్, బిజిలి కృష్ణ, నక్క ప్రకాష్, లక్ష్మి, సుజాత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# జై శ్రీరామ్ అవార్డ్స్ ప్రదానం




రాగా ఫైన్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ రంజని ఆధ్వర్యం లో జై శ్రీరామ్ అవార్డ్స త్యాగరాయ గానసభలో ప్రధానం చేశారు.ఇది సంస్థ 11వ ఈవెంట్.గోవర్ధన్ అడ్వకేట్ కేంద్రీయ విద్యాలయం బేగంపేట ప్రిన్సిపాల్ శంకర్ కేంద్రీయ విద్యాలయం భువనగిరి ప్రిన్సిపాల కీవీ చంద్రమౌళి ధరణి కమ్యూనికేషన్స్ హేమప్రసాద్ అతిథులుగా పాల్గొన్నారు.కీర్తన యశస్వీ సరితా పవన్ పాల్గొన్నారు.శ్రీరామ నవమి ని పురస్కరించుకుని ఈ కార్య క్రమం జరిగింది./ ముషీరాబాద్ మేజర్ న్యూస్

## 20న సింగపూర్‌లో అంతర్జాతీయ మహిళా సదస్సు



ముషీరాబాద్ మేజర్ న్యూస్ :యునైటెడ్ నేషన్స్, యునిసెఫ్, యునెస్కో సహకారంతో ఇంటిగ్రేటెడ్ గ్రామీణ అభివృద్ధి సంస్థ (ఐఆర్డిఎ) సింగపూర్ లో అంతర్జాతీయ మహిళా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు పి. వినయ్ కుమార్ తెలిపారు. ఇండియా నుంచి పలువురు మహిళా ప్రముఖులు పాల్గొంటున్నారని వివరించారు. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణులు డా. వనజా ఉదయ్, డా. వి. వినీల రావు, ఫిల్మ్ మేకర్ రుబీనా పర్వీన్,, సరిత మన్నెం, సీనియర్ పాత్రికేయులు డా. మహ్మద్ రఫీ, డా. వినయ్ సరికొండ, మణిపూర్ నుంచి డా. రావొమి రాబిన్ హెమి, ఢిల్లీ నుంచి డా. గీతా బోరా, బెంగళూరు నుంచి డా. సయ్యద్ రఫీ, నెల్లూరు నుంచి సామాజికవేత్త కె. రత్నం తదితరులు యునైటెడ్ నేషన్స్ లక్ష్యాలపై పత్ర సమర్పణ చేయనున్నారని, కళ పత్రిక మీడియా పార్టనర్ గా వ్యవహరిస్తున్నదని పి. వినయ్ కుమార్ తెలిపారు.

## 'సీఎస్‌బీ'లో సివిల్స్ విజేతల సందడి...



ముషీరాబాద్,మేజర్‌న్యూస్ ః సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ లో సివిల్స్ లో మంచి ర్యాంకులు సాధించారు. ఈమేరకు అశోక్‌నగర్‌లో అకాడమీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. విజేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మెరుగు కౌషిక్82,ధీరజ్‌రెడ్డి173 ,హరిప్రసాద్‌రాజు 198,కే. శ్రీనివాసులు 475,కిరణ్526,నాగభరత్568, ఐశ్వర్య580,రాజ్‌కుమార్ చౌహాన్ 649,ఆదా సందీప్‌కుమార్703,కే.రాహుల్830, హనిత వేములపాటి873,కే. శశికాంత్891,మీన899, రావూరి సాయి అలేఖ్య938, నవ్యశ్రీ995.విజేతలుగా నిలిచారు. అకాడమీ డైరెక్టర్ బాలలత విద్యార్థుల కృషిని వివరించారు. విజేతలు తమ విజయగాధలను విన్పించారు.సివిల్స్ విజేతల పారెంట్స్‌పారెంట్స్‌కూడా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

## 50ర్యాంకుల సాధించిన అనలాగ్ ఇనిస్టిట్యూట్..




అనలాగ్ ఐఏఎస్ ఇనిస్టిట్యూట్(ఇందిరాపార్కు క్రాస్ రోడ్స్, దోమలగూడ) ప్రతిష్టాత్మక సివిల్స్‌పరీక్షల్లో అన్ని బ్రాంచీలు కలిపి 50 టాప్ ర్యాంకులను సాధించింది. 12, 26, 47, 50..తదితర ర్యాంకులను 100లోపు 6 ర్యాంకులను సాధించింది .ఇనిస్టిట్యూట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్‌విన్నకోట మాట్లాడుతూ తమ సంస్థసివిల్స్‌లో అద్భుత విజయాలను సాధిస్తుందన్నారు.హనిత వేములూరి 887 (విశాఖ)ర్యాంకు సాధించింది. హనిత తన విజయనేపథ్యాలను వివరించింది. -ముషీరాబాద్,మేజర్‌న్యూస్ ...

# కోటి రూపాయల ఆస్తిని చవగ్గా కాజేసిన అధికార పార్టీ నేత

- నా సంతకం లేకుండా అక్రమంగా మా ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకున్న కాంగ్రెస్ నేత ఫరీద్‌పై చర్యలు తీసుకోవాలి
- నా తండ్రికి మాయమాటలు చెప్పి, మద్యం తాగించి గుట్టు చప్పుడు కాకుండా ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు
- ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తుండగా అంబర్‌పేట పోలీసులతో కలిసి బెదిరింపులకు పాల్పడుతున్నారు
- వేధింపులు,బెదిరింపులు ఇలాగే కొనసాగితే కుటుంబమంతా మూకుమ్మడిగా ఆత్మహత్యలు చేసుకుంటాం
- గోల్నాక దుర్గా నగర్‌కు చెందిన ఆనంద్, ఉషశ్రీ దంపతులు హెచ్చరిక



అంబర్ పేట్,మేజర్ న్యూస్ : తన కన్న తండ్రి పరిష సాయికుమార్ కు మాయ మాటలు చెప్పి ఆయనకు మద్యం తాగించి తనకు ఎలాంటి సమాచారం లేకుండా తన సంతకం లేకుండా తాత పేరునా ఉన్న అంబర్ పేట అలీ కేఫ్ దుర్గా నగర్ లోని 100 గజాల స్థలాన్ని గోల్నాక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ ఫరీద్ అక్రమంగా కొనుగోలు చేశాడని తన కుటుంబాన్ని తీవ్రంగా వేధిస్తున్నాడని పరిష ఆనంద్ ఆరోపించారు. అంబర్ పేట పోలీసులతో కలిసి ఫరీద్ ఇంటిని ఖాళీ చేయమని తనను బెదిరిస్తున్నాడని, బెదిరింపులు వేధింపులు ఇలాగే కొనసాగితే తాను తన భార్య పిల్లలు మూకుమ్మడిగా ఆత్మహత్యకు పాల్పడతామని ఆయన తెలిపారు. తమ ఆత్మహత్యకు ఫరీద్, అంబర్ పేట పోలీసులే కారణమని ఆయన ఆరోపించారు. పరిషా ఆనంద్, ఆయన భార్య పరిష ఉష్రశీలు మీడియాతో మాట్లాడుతూ తమ గోడును వెళ్ళబోసుకున్నారు. తన తల్లి పరుష స్వరూప రాణి తండ్రి అయిన అంజయ్య కొన్ని ఏళ్ల క్రితం దుర్గా నగర్ లో 2 వందల చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేశారని ఆనంద్ తెలిపారు. అయితే తన తల్లి స్వరూప రాణి పేరున ఉన్న ఈ స్థలాన్ని తండ్రి సాయికుమార్ తన పేరున మార్చుకుని ముందుగా వంద గజాల స్థలాన్ని ఇతరులకు అమ్ముకున్నాడని ఆయన తెలిపారు. అప్పటినుంచి తన భార్య ఇద్దరు పిల్లలు, తల్లి తండ్రులతో కలిసి మిగిలిన 100 చదరపు గజాల ఇంటిలో( నెంబర్ 2-3-692/1/డి/28) ఉంటున్నామని ఆయన తెలిపారు. కొద్ది రోజుల క్రితం గోల్నాక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ ఫరీద్ తన తండ్రి సాయికుమార్ కు రోజు మద్యం తాగిస్తూ, ఆయనకు మాయ మాటలు చెబుతూ ఒక్కగానొక్క కుమారుడినైనా తనకు ఎలాంటి సమాచారం లేకుండా తానుంటున్న 100 చదరపు గజాల స్థలాన్ని గుట్టు చప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆనంద్, ఉష్రశీ దంపతులు తెలిపారు. తనకు సమాచారం ఇవ్వకుండా, తన సంతకము లేకుండా ఫరీద్ తమ ఇంటిని ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకుంటాడని వారు ఆరోపించారు. దీంతో తాను న్యాయం సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించి పార్టిషన్ సూట్ ను ( కేసు నంబర్ 5818) ఫైల్ చేశానని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ కేసు సిటీ సివిల్ కోర్టులో నడుస్తున్న క్రమంలో ఫరీద్, అంబర్ పేట ఎస్సై విజయ్ కుమార్ తో కలిసి బెదిరింపులకు పాల్పడుతూ తనతో పాటు భార్య ఇద్దరు పిల్లలను తాను వుట్టిన తన తాత ఇంటి నుంచి బలవంతంగా వెళ్ళగొట్టాలని ప్రయత్నిస్తున్నారని ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై తాను గౌరవ కోర్టుకు, తూర్పు మండలం డిసిపికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మమ్మద్ అబ్దుల్ ఫరీద్, అంబర్ పేట ఎస్సై విజయ్ కుమార్ వేధింపులు, బెదిరింపులు ఇలాగే కొనసాగితే తాను తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి ముందే మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుంటామని ఆనంద్ హెచ్చరించారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రయోగాధార పరిశోధనపై గీతమ్‌లో వేసవి పాఠశాల



హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి: గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ (జీఎస్బీ) హైదరాబాద్ లో ఆర్థిక, ఎకనామిక్స్ శాస్త్రాలలో ప్రయోగాధార పరిశోధన ద్వారా నైపుణ్యాలను మెరుగు పరచు కునేందుకు, ఆయా రంగాల నిపుణులతో పరిచయాలను పెంపొందించు కునేందుకు మే 20 నుంచి 24న తేదీ వరకు నేనని పాఠశాలను నిర్వహించనున్నట్లు కన్వీనర్ డాక్టర్ అజయ్ కుమార్. వెల్లడించారు, పీహెచ్ డీ విద్యార్థులు, అధ్యాపకులు, మేనేజ్మెంట్ విద్యార్థులకు పరివర్తన అనుభవాన్ని అందించే లక్ష్యంతో జి ఎస్ బి లోని ఆర్థిక విభాగం దీనిని నిర్వహిస్తున్నట్టు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక,అకౌంటింగ్ పరిశోధనలో నైపుణ్యాలు,జ్ఞానాన్ని పెంపొందించడం కోసం నిర్వహిస్తున్న ఈ వారం. రోజుల కార్యక్రమంలో భాగంగా, జీఎస్ఏలో కొత్తగా స్థాపించిన బ్లూమ్బర్గ్ ఫైనాన్స్ ల్యాబ్ ను వినియోగించుకునేలా సెషన్లు రూపొందించినట్టు తెలిపారు. ఈ వారం రోజుల కార్యక్రమంలో పాల్గొనేవారు, కార్పొరేట్ ఫైనాన్స్, కార్పొరేట్ గవర్నెన్స్, బిహేవియరల్ ఫైనాన్స్ /ఎకనామిక్స్ పాటు ఎకనామిక పాలసీ చర్చల గురించి తెలుసుకుంటారన్నారు.పరిశోధనా ఇతివృత్తాలను రూపొందించడం, అనుభానిక పరిశోధనలో విధానపరమైన సవాళ్లను పరిష్కరించడం, ఆచరణాత్మక అంతర్దృష్టులతో నైపుణ్య కథనాల ను ప్రభావవంతంగా రాయడం, ప్రచురించడం చేస్తారని డాక్టర్ అజయ్ వివరించారు. అంతేగాక, ఎంపిక చేసుకున్న ఒక ప్రాజెక్టులో పనిచేస్తారని, ఈ కార్యక్రమం ముగిసిన 30 రోజులలోపు ముసాయిదా ప్రాజెక్టు నివేదికను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఐఐఎం నాగపూర్ చెందిన డాక్టర్ సతీష్ కుమార్, ఐఐఎం సిబ్లింగ్ కు చెందిన డాక్టర్ వర్ణిత వంటి ప్రఖ్యాత నిపుణులు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తలుగా పాల్గొంటారని తెలిపారు. పీహెచ్ డీ విద్యార్థులు, అధ్యాపకులు, మేనేజ్మెంట్ విద్యార్థులు, ఆర్థిక, దాని అనుబంధ రంగాలలో పరిశోధన చేసే వారు కూడా ఈ వేసవి పాఠశాలలో పాల్గొనడానికి అర్హులని డాక్టర్ అజయ్ స్పష్టీకరించారు.పేర్ల నమోదు, రుసుము, వసతి తదితర వివరాల కోసం తన మొబైల్ నెం. 88266 99667ను సంప్రదించాలని,లేదా 14. కు ఈ-మెయిల్ చేయాలని కన్వీనర్ సూచించారు.

## జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్. రోహిణిని సత్కరించిన టిఎన్‌జిఓ జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ ప్రతినిధులు



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్‌: ఉగాది,రంజాన్ పండుగలతోపాటు పదవ తరగతి స్పాట్ వాల్యూవేషన్ క్యాంపులను ఎంతో విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్. రోహిణిని టి.ఎన్.జి.ఓ.హైదరాబాద్ జిల్లా స్కూల్ ఏడ్యుకేషన్ యూనిట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్,కార్యదర్శి ఎం. భాస్కర్,జాయింట్ సెక్రెటరి జయంతి రెడ్డిలు ప్రత్యేకంగాకల్సి ఆమెకు పూలబోకే అందజేసి శాలువాకప్పి ఘనంగా సత్కరించి,అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చారి,రాజశేఖర్, రాజ్ కువార్ ,అర్చనా,అనురాధ,సరళారెడ్డి,విజయలక్ష్మి,సుగుణా రెడ్డి,అజ్మత్,విల్లియం,ఖాజా,సోహెల్,అహ్మద్,ఫయాజ్,అల్తాఫ్,గిరిజా తదితరులు పాల్గొని,డి.ఈ.ఓ.కు అభినందనలు తెలియజేశారు.

## చంద్రాయణ్‌గుట్ట నియోజకవర్గంలో పర్యటించిన బిజెపి హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి కె. మాధవి లత



అబిడ్స్ జోన్,మేజర్‌న్యూస్‌: బి.జె.పి. హైదరాబాద్ నియోజకవర్గం లోక్‌సభ అభ్యర్థి కె. మాధవి లత మంగళవారం చంద్రాయణ్‌గుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడ,సి.ఆర్.పి.ఎఫ్.క్వార్టర్స్,చంద్రాయణ్‌గుట్ట,కుమ్మర్‌వాడి,ఇందిరానగర్ తదితర బస్తీల్లో స్థానిక బి.జె.పి. నేతలతోకల్సి పాదయాత్రచేసి, ఓటర్లనుకల్సి మజ్లీస్ పార్టీని ఓడించాలంటే, వచ్చే ఎన్నికల్లో బి.జె.పి. పార్టీకే ఓటువేసి,తనను గెలిపించాలని ఆమె అభ్యర్థించారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం : మాధవరం కాంతారావు



కూకట్ పల్లి మేజర్ న్యూస్ :వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతుందని కూకట్ పల్లి నియోజకవర్గం భారతీయ జనతా ఇన్చార్జి మాధవరం కాంతారావు అన్నారు. కెపిహెచ్బి కాలనీ టెంపుల్ బస్ స్టాప్ లో మధుకర్ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మాధవరం కాంతారావు, సుభాష్ చంద్ర బోస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు కర్ర గోపి, నర్వ పవన్, సత్తిరాజు గుప్తా, మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి తోట రమేష్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషంగా ఉండాలి.. వి.జగదీశ్వర్ గౌడ్



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషంగా ఉండాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీ లో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాస్థానంలో జరిగిన శ్రీమదలర్మేల్ మంగా పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల 33వ వార్షిక బ్రహ్మోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భాను ప్రసాద్, భాషిపాక యాదగిరి నియోజకవర్గ నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అనాధ చిన్నారులతో కలిసి జన్మదినోత్సవ వేడుకలు జరుపుకున్న మాజీ కార్పొరేటర్ మిత్ర కృష్ణ



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్‌: జియాగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్,టి.పి.సి.సి. ఏస్సీ సెల్ మాజీ చైర్మన్,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మిత్ర కృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని హెల్పింగ్ హ్యాండ్స్ చిన్నారులతోకల్సి మాజీ కార్పొరేటర్ మిత్ర కృష్ణ ఏలాంటి ఆడంబరం లేకుండా తన జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం మిత్ర కృష్ణ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించి, తన జన్మదినోత్సవ వేడుకలను అనాధ చిన్నారులతోకల్సి జరుపుకున్నందుకు తనకు ఎంతో ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. అనంతరం అనాధ చిన్నారులతోకల్సి మిత్ర కృష్ణ సహా పంక్తి భోజనం చేశారు.

సూర్య
17-04-2024 బుధవారం

# శివ సేన జిల్లా అధ్యక్షులు బీజేపీలో చేరిక

## నాగం వర్షిత్ రెడ్డి



నల్గొండ టౌన్, మేజర్‌న్యూస్ : బిజెపిలో చేరిన శివసేన పార్టీ అధ్యక్షులు కందుకూరి నవీన్ కుమార్ కార్యకర్తలు. నల్గొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వర్షిత్ రెడ్డి, భువనగిరి పార్లమెంటు ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరిన నకిరేకల్ నియోజకవర్గంకు చెందిన శివసేన పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కందుకూరి నవీన్ కుమార్ 2014 నుంచి 2018 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణకు శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించడం జరిగింది. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీలో చేరిన అనంతరం బోనగిరి పార్లమెంటులో బూర నర్సయ్య గెలుపుకు కృషి చేస్తానని నవీన్ కుమార్ గారు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ గుండాల నరేష్ గౌడ్, బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ 400సీట్లుతో మోడీ ప్రధాని కావటం ఖాయం

## బూర నర్సయ్య గౌడ్

నల్గొండ టౌన్, మేజర్‌న్యూస్ : రామన్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి దేశంలో 400 సీట్లతో గెలుపొంది మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోడీ కావడం ఖాయమని భువనగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం నల్గొండలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన ప్రెస్మీట్లో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ ఆడుతున్న ఎన్నికల చదరంగంలో కోమటిరెడ్డి బ్రదర్స్ విలవిలలాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ భువనగిరిలో గెలిచేదిలేదు. ఆయన మంత్రి అయ్యేది లేదన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ సొంత ఊరిలో ఉన్న ఉదయ సముద్రం ప్రాజెక్టునే పూర్తి చేయలేదని, అది నేటికీ పూర్తి కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేవలం కాంట్రాక్టుల కోసమే తప్ప ప్రజలు, రైతుల బాధలు, ఆవేదనలు పట్టవన్నారు. తాను ఎంపీగా పని చేసిన ఐదేళ్ల కాలంలోనే రూ. 9వేల కోట్లు భువనగిరి పార్లమెంట్ అభివృద్ధికి తెచ్చానని, ఎయిమ్స్, కేవీఎస్, పాస్పోర్ట్ సెంటర్, ఇండస్ట్రియల్ పార్క్, రహదారులు, హాస్పిటల్స్, కాలేజీలతో పాటు ఎన్నో నిధులు తెచ్చి లక్ష కోట్ల సంపద తెచ్చానన్నారు. ఇతర రాష్ట్రాలలో కాంట్రాక్టులు తెచ్చుకునేందుకే రాజగోపాల్రెడ్డికి సమయం చాలలేదని, ప్రజల సంక్షేమం ఎలా చూస్తారన్నారు. బ్రదర్స్ తమ పదవులను రాజకీయ వ్యాపారానికి విజిటింగ్ కార్డుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. తన హాయాంలో తెచ్చిన ఎయిమ్స్ భువనగిరిలో నేటికీ 20శాతం పూర్తి కాలేదని, అయినా రోజుకు 2వేల మంది ఓపీ వస్తుందని, తాను గెలిచిన వెంటనే 100శాతం పూర్తి చేసి పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలందించేందకు కృషి చేస్తానన్నారు. నల్గొండ, భువనగిరి ప్రజలు తాము చెప్పే మాటలు విని విశ్లేషించి నిర్ణయం తీసుకోవాలని, దేశంలో 400 సీట్లతో మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోడీ కావడం ఖాయమన్నారు. ఆంధ్రా సీఎం జగన్ శ్రీశైలం నుంచి నీళ్లు తీసుకెళ్తుంటే ఎవరూ మాట్లాడడం లేదని, ఉదయ సముద్రం చీకటి సముద్రంగా మారిందని ఆరోపించారు. సమావేశంలో జాతీయ నాయకులు గోలి మధుసూదన్రెడ్డి, మాదగోని శ్రీనివాస్ పోతేపాక సాంబయ్య పోతేపాక లింగస్వామి, ఫకీర్ మోహన్ రెడ్డి పాశం శ్రీనివాస్ రెడ్డి వంగూరి రాఖి, గడ్డం మహేష్, బీపంగి జగ్జీవన్, గుండ్లపల్లి శాంతి స్వరూప్ తదితరులు ఉన్నారు.




# పదవ తరగతి పూర్తయిన విద్యార్ధులకు ఆన్లైన్లో శిక్షణ



కొండమల్లేపల్లి మేజర్ న్యూస్ః 2024 సంవత్సరం పదవ తరగతి వార్షిక పరీక్షలకు హాజరైన ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలీసెట్ 2024 ప్రవేశ పరీక్ష కొరకు జూమ్ ఆప్ ద్వారా ఉచితంగా ఆన్లైన్లో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొండమల్లేపల్లి యందు పనిచేస్తున్న ఉపాధ్యాయులు కొలనుపాక శ్రీపతి రావు తెలిపారు. గణితం, రసాయన శాస్త్రాల్లో ఈ శిక్షణ ఉంటుందని, ఈ శిక్షణ వివిధ గురుకుల కళాశాల ప్రవేశ పరీక్షలు రాయడానికి కూడా ఉపకరిస్తుందని, 2018 నుండి ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో చక్కటి ర్యాంకులు సాధించి అగ్రశ్రేణి పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం పొంది, ఆ తర్వాత ఈ సెట్ ద్వారా అగ్రశేణి ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశం పొందారని తెలిపారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవచ్చుని తెలిపారు.

# నల్లగొండ పార్లమెంట్ ఓబీసీ సెల్ ఇంచార్జీగా శెట్టి రామచంద్రారావు



మేళ్లచెరువు మేజర్ న్యూస్ః మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నల్గొండ పార్లమెంట్ ఓబీసీ సెల్ ఇంచార్జిగా సూర్యాపేట జిల్లా ఓబీసీ చైర్మన్ శెట్టి రామచంద్రారావును నియమిస్తూ తెలంగాణ ఓబీసీ చైర్మన్, తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఇంచార్జిగా నియమితులైన శెట్టి రామచంద్రారావు మాట్లాడుతూ నల్గొండ పార్లమెంట్‌లోని బలహీన వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ గతంలో అండగా ఉన్నారు. ఇప్పుడు కూడా ఉంటారు వారందరికీ సంక్షేమం కాంగ్రెస్ పార్టీతో మాత్రమే సాధ్యమవుతుందన్నారు. రఘువీర్ రెడ్డిని గెలిపించేందుకు పార్టీ శ్రేణులతో కలిసి అన్ని వర్గాలను కలుపుకుంటూ ముందుకు సాగుతూ ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలను తీసుకువెళ్తామని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థిని 6 లక్షల మెజార్టీతో గెలిపిస్తామని ధీమా వ్యకతం చేశారు. నల్గొండ పార్లమెంట్ ఇంచార్జిగా నియమించినందుకు మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డికి, తెలంగాణ ఓబీసీ చైర్మన్, తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌కి, రఘువీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## జగిని దంత వైద్యశాల ఆధ్వర్యంలో

# చలివేంద్రం ఏర్పాటు

నల్గొండ అర్బన్ మేజర్ న్యూస్ః జగిని దంత వైద్యశాల, జగిని టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో ఎస్పీ ఆఫీస్, హెడ్ క్వార్టర్ నందు ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని మంగళవారం జగిని వెంకన్న ప్రారంభించి మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాలలో జగిని సంస్థలు నిరంతరం ముందుండడం, వేసవిలో చలివేంద్రాల ఏర్పాటుతో పాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు పట్టణ ప్రజల మన్ననలు అందుకుంటున్నందుకు ఆనందంగా ఉందని అన్నారు. వేసవి కాలంలో చలివేంద్రం అందరి దాహార్తిని తీరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జగిని సంస్థల అధినేత జగిని వెంకన్న, డాక్టర్ జగిని ఆదిత్య, రవి, వెంకటేష్, బండారు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



# 1201 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్

## అసెంబ్లీ సెగ్మెంట్లో సమావేశాలు నిర్వహణ

## పోస్టల్ బ్యాలెట్ పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావు





చివ్వెంల మేజర్ న్యూస్ః లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నియమించిన కమిటీలు తమ బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి ఎస్ వెంకట్రావు అన్నారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా నియమించిన అధికారులు వారి బాధ్యతలు చేపట్టవలసిన అంశాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అదనపు కలెక్టర్లు సిహెచ్ ప్రియాంక, బి.ఎస్. లతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18న నోటిఫికేషన్ విడుదలతో నామినేషన్ ప్రక్రియ మొదలవుతుందని ఆ దిశగా ఎంసిసి బృందాలు నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలో 1201 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్‌తో పాటు సమస్యాత్మక కేంద్రాల్లో లోనా బయట వెబ్ క్యాస్టింగ్ చేపట్టాలని సూచించారు.

***కొనుగోలు ధాన్యాన్ని వెంటనే ట్యాగింగ్ మిలుల్లకు పంపాలి....***

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ సూచించారు. మంగళశారం ధాన్యం కొనుగోలు, చెల్లింపులు అలాగే మౌళిక వసతులపై ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఈ సందర్భంగా అన్ని కేంద్రాల్లో కొనుగోలు విధానం పారదర్శకంగా జరగాలని ఇప్పటివరకు 32,305 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రైతులకు 5.50 కోట్లు జమ చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే ట్యాగింగ్ మిల్లులకు పంపాలని అలాగే టాబ్ ఎంట్రీలు అదే రోజు జరగాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డీ మధుసూధన్ రాజు, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎంఓ నాగేశ్వర శర్మ, డిఎం రాములు, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రఘువీర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

మిర్యాలగూడ మేజర్ న్యూస్ః నల్గొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం సోమవారం నాడు మిర్యాలగూడ ఎన్ఎస్‌పి క్యాంప్ నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మణ్ రెడ్డి, నాగార్జునా సాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు శంకర్ నాయక్, రాష్ట్ర నాయకులు స్కైలాబ్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు పొదిల శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, మండల అధ్యక్షులు బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడి వలే పనిచేసి కుందూరు రఘువీర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.